ప్రజాశక్తి

శుక్రవారం 19 జులై 2024 | 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



నల్లమడను పరిశీలిస్తున్న రైతుసంఘం నాయకులు

నల్లమడ అభివృద్ధిపై

పాలకుల శీతకన్ను

- యుద్ధప్రాతిపదికన అభివృద్ధి చేయాలి..
- రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య డిమాండ్..

ప్రజాశక్తి-బాపట్ల

అధిక వర్షాలకు వరద ముంపు బారి నుండి లక్షలాది ఎకరాల పంట నష్టాన్ని నివారించే నల్లమడ డ్రెయిన్ అభివద్ధిపై ప్రభుత్వం అనాదిగా నిర్లక్ష్యం చేస్తోందని రైతుసంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య అన్నారు. గురువారం బాపట్ల జిల్లా రైతుసంఘం నాయకులతో కలిసి జిల్లెళ్ళమూడి సమీపంలో కట్టలు బలహీనపడిన నల్లమడ వాగును కృష్ణయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మాత్రం దీని అభివృద్ధికి పూర్తిస్థాయిలో ప్రణాళికబద్ధంగా కృషి చేయడం లేదన్నారు. దశాబ్దాలుగా రైతులకు ఎదురుచూపులు తప్పటం లేదన్నారు. నల్లమడ పనులకు ప్రభుత్వం నుంచి అనుమతులు, నిధులు మంజూరు చేయించాలని ▶ 2లో

'మేయర్'ను మార్చేదెట్లా.?

- రాజీనామా చేయించడమా...! లేక పార్టీలోకి తీసుకోవడమా...!
- తెలుగుదేశం పార్టీ నేతల ముందు రెండే ఆప్షన్లు
- నాలుగేళ్లు స్థానికసంస్థల్లో అవిశ్వాసం పెట్టడానికి వీల్లేదని చట్టం చేసిన గత ప్రభుత్వం
- మేయర్‌ను మార్చుకోవాలన్న టిడిపి నేతల ఆశలపై నీళ్లు



మేయర్ సుజాత (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరపాలక సంస్థలో ఇప్పుడున్న మేయర్‌ను నాలుగేళ్ల పాటు ఆ స్థానం నుంచి దించడానికి వీల్లేదు. మేయర్ పాటికి మేయర్ రాజీనామా చేస్తే మరలా మేయర్ ఎన్నిక చేసుకోవచ్చు. అది కూడా రిజర్వేషన్‌కు లోబడే.. లేదా ఇప్పుడున్న మేయర్ పార్టీ మారవచ్చు. ఇది చట్టం. గత ప్రభుత్వం చేసిన శాసనం. దీన్ని బట్టి చూస్తే ఒంగోలు కార్పొరేషన్‌లో మేయర్ స్థానాన్ని దక్కించుకోవాలన్న తెలుగుదేశం పార్టీ నేతల ఆశలు ఫలించేలా లేవు. చట్టప్రకారం ఇప్పుడున్న మేయర్ రాజీనామా చేస్తేనే తెలుగుదేశం పార్టీ వాళ్లు కొత్త మేయర్‌ను ఎన్నిక పద్ధతిలో ఎంపిక చేసుకోవచ్చు. అది కూడా రిజర్వేషన్‌లకు లోబడి మాత్రమే. ఇప్పుడు ఈ విషయం అధికార పార్టీలో చర్చగా మారింది. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడం, ఇక్కడ ఒంగోలు నియోజకవర్గం నుంచి దామచర్ల జనార్ధన్ గెలుపొందడంతో ఒంగోలు కార్పొరేషన్ కూడా ఇక తమ వశమవుతోందని గత కొన్ని రోజులుగా తెలుగుదేశం పార్టీ నేతలు బాకా ఊదుతున్నారు. వైసిపి కార్పొరేటర్లు కూడా టిడిపిలో చేరుందుకు క్యూ కడుతుండటంతో కార్పొరేషన్‌లో వైసిపి ఖాళీ అవుతోందని ప్రచారం జరుగుతోంది. అయితే చట్టాలను పరిశీలిస్తే ఇప్పుడున్న మేయర్‌కు ఆ స్థానం పదిలమనే చెప్పాలి. మేయర్ రాజీనామా చేయడమా...? లేక చేయించడమా.? జరిగితేనే కార్పొరేషన్ పాలకవర్గం విషయంలో మార్పులు జరిగే అవకాశం ఉంది. లేదా వారే పార్టీ మారి అధికార పార్టీ మేయర్‌గా ముద్ర వేసుకోవచ్చు.

అవిశ్వాసం పెట్టడానికే వీలు లేదు..

స్థానిక సంస్థల్లో ఇప్పుడున్న మేయర్ మీద, డిప్యూటీ మేయర్ల మీద అవిశ్వాసం ▶ 2లో

జిల్లా జడ్జిని కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

బాపట్ల జిల్లా కలెక్టర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన జె.వెంకటమురళి గురువారం ప్రకాశం జిల్లా ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ మరియు సెషన్స్ జడ్జి ఎ.భారతిని ఒంగోలులో మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు.



జిల్లా జడ్జితో కలెక్టర్ వెంకటమురళి

పోలీసు అధికార లాంఛనాలతో

లుథియారావు అంత్యక్రియలు

శవపేటిక మోసిన ఎమ్మెల్యే నరేంద్రవర్మ

ప్రజాశక్తి-బాపట్ల

గుండెపోటుతో హఠాన్మరణానికి గురైన పిట్టలవానిపాలెం మండలం, అల్లూరు గ్రామానికి చెందిన అసెంబ్లీ మార్షల్ కె.లుథియారావు అంత్యక్రియలు పోలీసు అధికార లాంఛనలతో గురువారం అల్లూరు స్మశానవాటికలో నిర్వహించారు. అసెంబ్లీ మార్షల్ కె.లుథియారావు బుధవారం గుండెపోటుతో మృతిచెందిన విషయం ▶ 2లో



గాల్లోకి కాల్పులు జరుపుతున్న పోలీసులు

● 'లక్కీ' హీరోయిన్స్.!





ఒంగోలులోని లక్కీ షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో గురువారం సినీ హీరోయిన్లు సంయుక్త మీనన్, శ్రీలీల సందడి చేశారు. సంయుక్త మీనన్‌తో కలిసి మంత్రి డోలా వీరాంజనేయస్వామి, ఎంపీ, ఎమ్మెల్యేలు షాపింగ్‌మాల్‌ను ప్రారంభించారు. శ్రీలీల డ్యాన్స్ వేసి.. యువతను ఉత్సాహపరిచారు.



మాట్లాడుతున్న మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ

అన్నా క్యాంటీన్ల ద్వారా

నాణ్యమైన భోజనం

- మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ వెల్లడి
- ఒంగోలులో పోతురాజు కాలువ పరిశీలన

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

రాష్ట్రవ్యాప్తంగా అన్నా క్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.5కే నాణ్యమైన బోజనం అందుబాటులో ఉంచుతామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. గురువారం ఒంగోలు వచ్చిన ఆయన పట్టణంలో అన్నా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రతిపాదించిన కేంద్రాలను పరిశీలించారు. ముందుగా నగరంలోని పోతురాజు కాలువను పరిశీలించిన ఆయన పోతురాజుకాలువ ఆధునీకరణ ▶ 3లో

'మేయర్'ను మార్చేదెట్లా.?

(మొదటిపేజీ తరువాయి)

పెట్టడానికి లేదని చట్టం చెబుతోంది. ఒంగోలు కార్పొరేషన్‌లో స్వతహాగా తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ల బలం ఆరుగురు.. జనసేన కార్పొరేటర్ మద్దతు కూడా వారికి ఉంది. ఎన్నికల ముందు ఐదు మంది వైసిపి కార్పొరేటర్లు టిడిపిలో చేరారు. టిడిపి, జనసేన బలం 12 అయ్యింది. ఇటీవల ఇద్దరు ముగ్గురు వైసిపిని వీడి టిడిపిలో చేరారు. డిప్యూటీ మేయర్ వేమూరి బుజ్జి, మరికొంతమంది కార్పొరేటర్లు ఎమ్మెల్యే జనార్ధన్‌ను కలసి తమ మద్దతు తెలిపారు. త్వరలోనే పార్టీ మారేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఎటు తిరిగి కౌన్సిల్‌లో టిడిపి బలం 20 మందికి వెళుతోందని ఓ అంచనా. వాస్తవానికి 26 మంది కార్పొరేటర్లు మద్దతు ఉన్న పార్టీ మేయర్‌ను ఎంపిక చేసుకోవాలి. ఇది గతంలో.. అయితే గత వైసిపి ప్రభుత్వ హయాంలో స్థానిక సంస్థల్లో మేయర్, డిప్యూటీ మేయర్ల మీద నాలుగేళ్ల పాటు అవిశ్వాసం పెట్టడానికి వీలు లేదని చట్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని స్థానిక సంస్థల్లో ఇది చట్టం రూపంలో అమల్లో ఉంది.

చట్టంలో మార్పు చేస్తే సాధ్యమే..

తెలంగాణలో కూడా నాలుగేళ్ల పాటు స్థానికసంస్థల్లో అవిశ్వాసం పెట్టడానికి వీలులేదని ఉన్న జీవోను ఇటీవల సవరించారు. దాన్ని మూడేళ్లకు మార్పు చేశారు. ఆంధ్రప్రదేశలో కూడా ఆ విధమైన మార్పు చట్టంలో చేసుకునే అవకాశం ఉంది. క్యాబినెట్‌లో చర్చించి, అసెంబ్లీ ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. అప్పుడు మెజారిటీ ఉన్న పార్టీ వాళ్ల అవిశ్వాసం పెట్టి కొత్తవారిని ఎంపిక చేసుకునే అవకాశం ఉంది. అది రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ స్థాయిలో జరగాల్సిన ప్రక్రియ. ఇప్పటికే ఒంగోలులో పాలకవర్గం పదవీకాలం సుమారు మూడు సంవత్సరాల నాలుగు మాసాల వరకు గడిచింది. మరో 20 మాసాలు మాత్రమే కార్పొరేటర్ల పదవి ఉంది. తరువాత స్థానికసంస్థల ఎన్నికలకు పోవాల్సి ఉంటుంది. మేయర్‌కు నాలుగేళ్ల షరతుకు కూడా ఎటు తిరిగి సుమారు ఎనిమిది నెలలే ఉంటుంది. ఈ క్రమంలో రాష్ట్రప్రభుత్వం స్థానిక సంస్థల చట్టంలో ఎలాంటి మార్పులు చేస్తుందో చూడాల్సి ఉంది.

మేయర్ కూడా ఏమీ చేయలేరు.!

ఒంగోలు కార్పొరేషన్‌లో తెలుగుదేశం పార్టీ బలం పుంజుకున్నా మేయర్ స్థానంలో ఇప్పుడున్న వారిని మార్చడానికి లేదు. అలాగని సీట్‌లో అంటిపెట్టుకున్నా మేయర్ కూడా ఏమీ చేయలేని పరిస్థితి నెలకొంటుంది. కౌన్సిల్ సమావేశంలో మెజారిటీ సభ్యులు ఆమోదం లేకుండా ఎలాంటి పనులైనా ముందుకు వెళ్లవు. కౌన్సిల్‌లో మెజారిటీ సభ్యులుగా ఉన్న వారు ఆమోదం తెలపకపోతే పనులు చేసే విషయంలో మేయర్ కూడా ఏమీ చేయలేని పరిస్థితులు వస్తాయి.

ఇప్పుడున్న మేయర్‌ను దించేసి ఆ స్థానంలో మరో ఎస్సీ మహిళను తెలుగుదేశం పార్టీ నుంచి మేయర్‌గా రంగంలోకి దింపాలని తెలుగుదేశం పార్టీ కీలక నేతలు చేస్తున్న ప్రయత్నాలు చర్చనీయాంశంగా మారాయి. అయితే ఈ విషయాలేవీ తెలుగుదేశం పెద్దలకు తెలియనవి కావు అని వినికిడి. రాష్ట్ర వ్యాప్తంగానే స్థానిక సంస్థల్లో మేయర్‌లు, డిప్యూటి మేయర్ల ఎంపిక చట్టంలోనే మార్పు చేస్తారనే చర్చ జోరుగా జరుగుతోంది.



ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి -గిద్దలూరు

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఏ.ఓంకార్ అన్నారు. పట్టణంలో గిద్దలూరు మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. అత్యధిక రోడ్డు ప్రమాదాల్లో హెల్మెట్ లేక చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ఒక నిండు ప్రాణం పై వారి కుటుంబాలు ఆధారపడి ఉంటాయని కావున వారి కుటుంబాన్ని దృష్టిలో ఉంచుకుని అయిన ప్రమాదాల బారి నుండి తమను తాము రక్షించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బి మేరీ సారా ధానమ్మ, గిద్దలూరు స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఆఫ్ సెకండ్ క్లాస్ తోట శ్రీనివాసులు, గిద్దలూరు న్యాయవాదుల సంఘం అధ్యక్షులు పి ఎన్ శేషశయనారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ షేక్ ఉస్మాన్ షరీఫ్, సెక్రటరీ ఉదయగిరి మల్లికార్జున రావు, న్యాయవాదులు ఎ తిరుమల ప్రసాద్, బి గిరి, వలసాని సుధీర్, సీఐ సోమయ్య, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నల్లమడ అభివృద్ధిపై పాలకుల శీతకన్ను

(మొదటిపేజీ తరువాయి)

నల్లమడ రైతు సంఘం నేతలు కోరుతున్నప్పటికీ పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. నల్లమడ వాగు ఆధునికీకరణ పనులకు ఆదిలోనే అడ్డంకులు ఎదురయ్యాయన్నారు. భారీవర్షాలు కురిసిన సమయంలో వాగు పొంగి ప్రవహిస్తూ గుంటూరు, ప్రకాశం జిల్లాల్లో లక్ష ఎకరాల్లో పంట భూములు ముంపు ముప్పు ఎదుర్కొంటున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో నల్లమడ ఆధునికీకరణకు రూ.360 కోట్లు అంచనా వ్యయంతో అనుమతులు లభించాయన్నారు. జలవనరుల శాఖ నివేదిక రూపొందించిందన్నారు. వాగు విస్తరణకు భూసేకరణ ప్రతిపాదనల నివేదికను కలెక్టరేట్‌కు జలవనరుల శాఖాధికారులు అందజేశారని చెప్పారు. నల్లమడ రైతుసంఘం ప్రతినిధులు ప్రజాప్రతినిధులను కలిసి 2020లో అప్పటి సీఎం జగన్ దష్టికి ముంపు సమస్య తీసుకెళ్లి ఆధునికీకరణ పనులు ప్రారంభించటానికి అనుమతి, నిధులు మంజూరు చేయించాలని విజ్ఞప్తి చేసినా ఫలితం దక్కలేదన్నారు. పల్నాడులో నల్లమల్ల అడవుల సమీపంలో ప్రారంభమయ్యే నల్లమడ వాగు బాపట్ల మండలం, సూర్యలంక సమీపంలోని పొగురు వద్ద సముద్రంలో కలుస్తోందన్నారు. వాగు దిగువ ప్రాంతంలో మరింత వెడల్పు చేయాల్సిన అవసరం ఉందన్నారు.

సిపిఎం జిల్లా కార్యదర్శి గంగయ్య మాట్లాడుతూ 2013 అక్టోబరులో వచ్చిన వరదలకు నీరు వాగు కట్టల పైనుండి వరద నీరు పొంగి ప్రవహించడంతో నీటి ప్రవాహ ఉధతికి 116 చోట్ల గండ్లు పడ్డాయన్నారు. జిల్లెళ్లమూడి గ్రామం జల దిగ్బంధంలో చిక్కుకుపోయిందన్నారు. కొమ్మమూరు కాల్వ కట్టలు సైతం కొట్టుకుపోయాయని చెప్పారు. లక్ష ఎకరాల్లో పంటలు నీట మునిగి వరి, పత్తి, పచ్చిమిర్చి, శనగ, కూరగాయల రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. బాపట్ల పట్టణంలో లోతట్టు ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయని తెలిపారు. నివాస గహాల్లోకి వర్షపు నీరు ప్రవేశించి ప్రజలు తీవ్రంగా ఇబ్బంది పడ్డారన్నారు. 216 జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహించిందన్నారు. బాపట్ల- పెదనందిపాడు రహదారి కొట్టుకుపోయింది. వాగుకు మరోసారి 2016 సెప్టెంబర్‌లో వరదలు వచ్చి కట్టలు తెగి గండ్లు పడి 32 వేల ఎకరాల్లో పంట నీట మునిగిందన్నారు. రైతులకు రూ.18 కోట్ల మేర పంట నష్టం జరిగిందన్నారు. ఈ నేపథ్యంలో ముంపు సమస్యను శాశ్వతంగా పరిష్కరించడానికి నల్లమడను ఆధునికీకరించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రూ.360 కోట్లతో ఈ ప్రాజెక్టు చేపట్టడానికి పాలనాపరమైన అనుమతులు మంజూరు చేసిందన్నారు. అప్పటి నుంచి దీనికి సంబంధించిన దస్త్రం ముందుకు కదలలేదని తెలిపారు. అప్పట్లో ప్రభుత్వం పనులు రద్దు చేసిందని, తిరిగి అనుమతి వస్తే భూసేకరణ జరిపి పనులు చేపడితే మూడేళ్లలో పూర్తవుతాయని నిపుణులు పేర్కొంటున్నారన్నారు. భూసేకరణ ప్రారంభించటానికి ప్రస్తుత సమయం అనుకూలంగా ఉందన్నారు. సర్వే చేసి వెంటనే సేకరిం చటానికి అవకాశం ఉందన్నారు. నల్లమడ వాగు ఆధునికీకరణకు రూ. వందల కోట్లలో నిధులు కావాల్సి ఉందన్నారు. ఉన్నత స్థాయిలో చర్చించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుని అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాగు ఆధునికీకరణ పనులకు నిధులు కేటాయించి నల్లమడ పరివాహక ప్రాంత రైతులను ఆదుకోవాలని కృష్ణయ్య కోరారు. అంతకుముందు బాపట్ల శివారు శ్యాంప్ డ్రెయిన్, మూలపాలెం శివారులో మురుగు, పంట కాలువలతోపాటు పిటి ఛానల్‌ను రైతు నాయకులతో కలిసి పరిశీలించారు. అనంతరం జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబుకు పంట కాలవలు, మురుగు కాలువలకు త్వరితగతిన మరమ్మతులు నిర్వహించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కాలువలను పరిశీలించిన వారిలో రైతు నాయకులు తల్లపనేని రామారావు కందిమళ్ళ రామకోటేశ్వరరావు, గోవిందరెడ్డి, కొండయ్య, వి.కష్ణమూర్తి, సిపిఎం నాయకులు పాల్గొన్నారు.

లుధియారావు అంత్యక్రియలు

(మొదటిపేజీ తరువాయి)

తెలిసిందే.. ఈయన పార్థివదేహం వద్ద నరేంద్రవర్మ నివాళులర్పించారు. అంత్యక్రియ ల్లో పాల్గొని శవపేటికను మోశారు. లుధి యారావు లేని లోటు ఆ కుటుంబానికి తీర్చల ేనిదన్నారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. కుటుంబానికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని నరేంద్రవర్మ భరోసా కల్పించారు. అంతిమయాత్రలో పోలీస్ అధికారులు, గ్రామస్తులు, తెలుగుదేశం, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



శవపేటిక మోస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర వర్మ

ఇటు మున్సిపాలిటీలో లేక.. అటు పంచాయతీలో లేక..

అభివృద్ధికి నోచుకోని ఇందిరమ్మ కాలనీ

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం సమీపంలోని ఇందిరమ్మ కాలనీ వాసులు త్రిశంకు స్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారు. నివాసిత ప్రదేశం ఇటు మున్సిపాలిటీలో కానీ అటు గ్రామ పంచాయతీలో లేకపోవడంతో అభివృద్ధి పనులు జరగడం లేదు. కాలనీవాసులు ఎక్కడ ఉంటున్నారనేది నేటికీ ప్రశ్నార్థకంగా మిగిలిపోయింది. కాలనీ ఏర్పడి రెండు దశాబ్దాలు కావస్తున్నా అక్కడి ప్రజల గోడు పట్టించుకున్న పాలకులే కరువయ్యారు.! మార్కాపురం మున్సిపాలిటీలో ఇందిరమ్మ కాలనీ పేరుతో 2004-2009 కాలంలో పేదలకు ఇళ్లు నిర్మించారు.

కనీస వసతులు కరువు..

ఇందిరమ్మ కాలనీల్లో విద్యుత్ సౌకర్యం కల్పించారు. నీటి వసతి కోసం వాటర్ ట్యాంకులు నిర్మించారు. బోర్లను అందుబాటులో ఉంచారు. కానీ పైప్‌లైన్ మాత్రం అసంపూర్తిగా మిగిలిపోవడంతో నీటి సరఫరా జరగడం లేదు. రహదారులు, మురుగు కాలువల ఊసే లేదు. వీటితో పాటు ప్రభుత్వ పాఠశాల, వైద్యశాల వంటివి అందుబాటులో లేవు. కనీసం వీధిదీపాలు కూడా సొంతంగా వెలిగించుకోవాల్సిందే. ఇందిరమ్మ కాలనీ ఫేజ్-1లో ముందుగా పనులు ప్రారంభిచడంతో అక్కడ నివాస గృహాలు లబ్ధిదారులు పూర్తి చేసుకున్నారు. ఆ కాలనీలో 1911 గృహాలకు గానూ ప్రస్తుతం 400 కుటుంబాలు మాత్రమే



ఇందిరమ్మ కాలనీ

నివాసం ఉంటున్నాయి. నివాసాలకు యోగ్యమైనా సౌకర్యాల లేమితో ప్రజలు అక్కడ నివసించేందుకు ఇష్టపడటం లేదు. చాలా గృహాలు పూర్తయినా నిరుపయోగంగా ఉన్నాయి. నివాసాలు ఉండకపోవడంతో గృహాలు కూడా శిథిలమవుతున్నాయి. కాలనీ వాసులందరూ గతంలో మార్కాపురం మున్సిపాలిటీ ప్రజలే. వారంతా మార్కాపురం మున్సిపాలిటీలో తమ కాలనీ విలీనం చేయాలని కోరుకుంటున్నారు. మున్సిపాలిటీ కౌన్సిల్ సమావేశాల్లో ప్రతిపాదనలు పంపడమే కానీ ప్రభుత్వం నుంచి అనుమతి లభించడం లేదు. ఇక్కడ పాలకులు కూడా దానిపై పెద్దగా పట్టించుకున్న సందర్భాలు లేవనే విమర్శలు లేకపోలేదు.

ప్రతి పనికీ పట్టణం వెళ్లాల్సిందే..

అక్కడ నివాసితులే అయినా... వారికి చిరునామా లేకపోవడంతో గతంలో పట్టణ ప్రాంతంలో ఉన్న చిరునామాలతో కొనసాగుతున్నారు. ఓటర్లుగా నేటికీ మున్సిపాలిటీలో కొనసాగుతున్నారు. అక్కడ అడ్రస్ లేనివారుగా ఉండిపోవడంతో రేషన్ సరుకులకు కూడా పట్టణం వెళ్లాల్సి వస్తోంది. అందరూ పేదలే కావడంతో నిత్యం ఆటో బాడుగులకే సగం సంపాదన ఖర్చవుతోందని ప్రజలు వాపోతున్నారు. తమ కాలనీ మున్సిపాలిటీలో విలీనం చేస్తేగానీ తమకు రహదారులు, మురుగు కాలువలు, విద్యుత్ దీపాలు, పాఠశాల, వైద్యశాల, అంగన్‌వాడీ కేంద్రాలు వంటివి అందుబాటులో ఉంటాయని, ఆ దిశగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. తాజాగా ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి బుధవారం నాడు మార్కాపురం విచ్చేయగా ఇందిరమ్మ కాలనీ వాసులు పడుతున్న బాధలను వివరించారు. ఎందుకు తమను ఇలా వదిలేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

15 ఏళ్లుగా సమస్యలతో సాగుతున్నాం...

ఇక్కడ 15 ఏళ్లుగా నివాసం ఉంటున్నాం. ప్రజా ప్రతినిధులు, అధికారులను కలుస్తూనే ఉన్నాం. తమ సమస్యలు చెప్పినా అప్పటికి ఆలకిస్తారు... ఆ తరువాత పట్టించుకోరు. ఇప్పటికీ సమస్యల పరిష్కారానికి ఎవ్వరూ చొరవ చూపడం లేదు. తాము ఇలా ఎంత కాలం ఇక్కడ జీవించాలి. అవసరాలకు నీటిని కూడా ట్యాంకరుకు రూ. 800 ఇచ్చి కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి ఇక్కడ తయారైందని నివాసితుడు షేక్ షబ్బీర్ ఆవేదన వ్యక్తం చేశాడు.

షేక్ షబ్బీర్, ఇందిరమ్మ కాలనీ

కాలువలో పూడిక తీస్తూ జెసిబి బోల్తా

డ్రైవర్‌కు గాయాలు

ప్రజాశక్తి-బాపట్ల

పట్టణంలోని భీముని గుంట వాగు (తవ్వకాలవ) మరమ్మతులు చేస్తుండగా జెసిబి బోల్తా డటంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గురువారం తవ్వకాలువలో పూడిక తీస్తున్న సందర్భంగా ఈ సంఘటన జరిగింది. గాయపడిన జెసిబి డ్రైవరును మునిసిపల్ సిబ్బంది ఏరియా వైద్యశాలలో చేర్చారు. తవ్వకాలువ అంచున ఇసుక ఉన్న కారణంగా ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.

ఇంటిపై కూలిన తాటిచెట్టు

ప్రజాశక్తి-కొల్లూరు

కొల్లూరు గౌడ్ పాలెంలో బుధవారం రాత్రి ఈదురు గాలులతో కురిసిన వర్షంతో తాటిచెట్టు విరిగి ఇంటిపై పడింది. దీనితో ఇల్లు పూర్తిగా దెబ్బ తిన్నది. ఈ విషయం తెలిసి కొల్లూరు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు మైనేని మురళీకృష్ణ విఆర్‌ఓను వెంటపెట్టుకుని దెబ్బతిన్న ఇంటిని పరిశీలించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులతో మాట్లాడి ఇంటికి నష్టపరిహారం అందేలా చేస్తానని అధైర్య పడవద్దని పరమేష్ కుటుంబానికి హామీ ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ మీకు అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు నాగులు, శరత్, జోగి భీమయ్య, వరాల వీర రాఘవయ్య పాల్గొన్నారు.

టీవీఎస్ వాహనం చోరీ

ప్రజాశక్తి -పామూరు

పామూరులో బైకు దొంగలు రెచ్చిపోతున్నారు. ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైకులు కళ్ల మూసి తెరిచేలోపే మాయమైపోతున్నాయి. స్థానిక యూనియన్ బ్యాంక్‌లో పనిచేస్తున్న అబ్బారెడ్డి శ్రీనివాసులు తన టివిఎస్ వాహ నాన్ని ఉదయం 10 గంటల సమయంలో ఆఫీస్ ముందు పెట్టి లోపలికి వెళ్లి మోటార్ వేసి వచ్చే లోపు గుత్తుతెలి యని వ్యక్తులు అహరించారు. పామూరులో సీసీ కెమె రాలు ఉన్నప్పటికీ అవి పనిచేయడం లేదు. దీంతో బైకు లను చోరీ చేస్తున్న నిందితులను గుర్తించే వీలు లేకుండా పోయింది. ఇప్పటికైనా సీసీ కెమెరాలకు మరమ్మతులకు చేయించి చోరీలకు పాల్పడుతున్న నిందితులను పట్టుకొని బాధితులకు న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం బియ్యం, కందిపప్పు విక్రయ కేంద్రాన్ని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు సరసమైన ధరలలో నాణ్యమైన సరుకులు అందించేందుకు ప్రభుత్వం ఈ కేంద్రాలను ఏర్పాటు చేసిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ కేంద్రాను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. బయట మార్కెట్‌లో అధిక ధరలు పలుకుతున్న కందిపప్పు, బియ్యం సరసమైన ధరలకు అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సోమ్లా నాయక్, ఈవోఆర్డీ ఈదుల రాజశేఖర్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్లు చేకూరి సుబ్బారావు, పయ్యావుల ప్రసాద్, నాయకులు కంచర్ల సత్యనారాయణ గౌడ్, బివి సుబ్బారెడ్డి, తోటా మహేష్ నాయుడు, కోటయ్య, చిట్టేల వెంగళరెడ్డి, కొత్తమాసు సుబ్రమణ్యం, షేక్ మస్తాన్‌వలి, మంత్రూ నాయక్, కామేపల్లి వెంకటేశ్వర్లు, ఆతుకూరి క్రిష్టయ్య, వెంకట్రావు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



కందిపప్పు, బియ్యం పంపిణీ చేస్తున్న అధికారులు

పెద్దదోర్నాల: పెద్దదోర్నాల పట్టణంలోని షణ్ముఖ గోవర్ధన్ ట్రేడర్స్‌లె గురువారం కందిపప్పు, బియ్యం విక్రయ కేంద్రాన్ని తహశీల్దార్ హమీద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాసర్‌రెడ్డి, ఆర్ఐ నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రావు, వీఆర్వోలు ఏడుకొండలు, సునీత పాల్గొన్నారు.

కొమరోలు: కొమరోలు పట్టణంలో ప్రభుత్వ చౌక ధరల దుకాణాన్ని గురువారం తహశీల్దార్ మల్లికార్జున నాయుడు, టిడిపి నాయకులు సంజీవరెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధ్యక్షుడు బోనేని వెంకటేశ్వర్లు, జనసేన పార్టీ నాయకుడు నారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు, ఎంపీడీవో, టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ల ద్వారా నాణ్యమైన భోజనం

(మొదటిపేజీ తరువాయి)

పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. తరువాత కొత్తపట్నం బస్టాండ్, కలెక్టరేట్ సెంటర్లలో అన్నా క్యాంటీన్ల ప్రతిపాదిత సెంటర్లను పరిశీలించి, అక్కడ వసతుల ఏర్పాటుకు నగరపాలక సంస్థ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆగష్టు 15 నుంచి రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లను తిరిగి ప్రారంభించనున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 2019 సంవత్సరానికి ముందు రాష్ట్రంలో 203 అన్నా క్యాంటీన్లను మంజూరు చేయగా, 183 పనిచేయడం జరిగిందన్నారు. పేదలకు రూ.5కే నాణ్యమైన భోజనం అందించామని చెప్పారు. లక్షలాది మంది పేదలకు అన్నా క్యాంటీన్లు ఆసరాగా నిలిచాయన్నారు. ఇప్పుడు కూడా పేదలకు ఉపయోగపడేలా అన్నా క్యాంటీన్లను నిర్వహిస్తామని చెప్పారు. రాష్ట్రంలో వర్షాకాలం సీజన్ ప్రారంభమైందని, కలుషిత నీరు వల్ల డెంగ్యూ, డయేరియా లాంటి వ్యాధులు వస్తున్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో గురువారమే రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ కమిషనర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించామని చెప్పారు. డ్రెయినేజీ పూడిక తీత పనులకు రూ.50 కోట్లు నిధులు కేటాయించామని చెప్పారు. వచ్చే పదిరోజుల్లో వందశాతం డ్రెయిన్లు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని కమిషర్‌లకు ఆదేశాలు ఇచ్చామని చెప్పారు. మున్సిపాలిటీలలో డ్రెయిన్ వాటర్ శుభ్రం చేసేందుకు సీవరేజి ప్లాంట్ల నిర్మాణానికి స్థల సేకరణ కోసం రూ.300కోట్లు నిదులు అవసరమని జిల్లా కలెక్టర్ల నుంచి ప్రతిపాదనలు వచ్చాయని, ముఖ్యమంత్రి ఆనిధులు కూడా మంజూరు చేశారని మంత్రి తెలిపారు. ఒంగోలులో పోతురాజు కాలువను పూర్తి చేస్తే ఒంగోలు నగరంలో సగం డ్రెయినేజీ సమస్య పరిష్కారం అవుతోందని స్థానిక ఎమ్మెల్యే జనార్ధన్ తన దృష్టికి తెచ్చారని, పోతురాజు కాలువను తాను ప్రత్యక్షంగా పరిశీలించానని చెప్పారు. ఈ సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకు వెళ్లి విడతల వారీగా పోతురాజుకాలువ ఆధునీకరణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటానని హామి ఇచ్చారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ మాట్లాడుతూ నగరంలో త్వరలోనే నాలుగు అన్నా క్యాంటీన్లు అధికారంగా ప్రజలకు అందుబాటులోకి రానున్నట్లు తెలిపారు. పోతురాజు కాలువ సమస్య పరిష్కారానికి మంత్రి హామీ ఇచ్చారని, త్వరలోనే ఆసమస్య కూడా పరిష్కరిస్తామని చెప్పారు. మంత్రి వెంట నగరపాలక సంస్థ కమిషనర్ ఎం జస్వంతరావు, జనసేన పార్టీ జిల్లా అధ్యక్షులు రియాజ్, కార్పొరేషన్ అధికారులు ఉన్నారు.



దెబ్బతిన్న ఆర్టీసీ బస్సు ముందు భాగం

లారీని ఢీకొన్న బస్సు

ప్రయాణికులకు తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - అద్దంకి

ఒంగోలు నుంచి అద్దంకి వస్తున్న ఆర్టీసీ అద్దె పట్టణంలోని రాంనగర్ సమీపంలోని వేలమూరిపాడు డొంక వద్ద ముందు వెళ్తున్న లారీని ఢీకొంది. ఈ ఘటనలో ఆర్టీసీ బస్సు ముందు భాగం దెబ్బతినగా దానిలో ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదమూ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఆర్టీసీ డిపో అధికారులు ఘటన జరిగిన స్థలాన్ని పరిశీలించారు. లారీ ఒంగోలు వైపు నుంచి నరసరావుపేట వైపునకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ సమయంలో కొద్దిపాటి ట్రాఫిక్ అంతరాయం కలగగా స్థానికులు లారీని పక్కన ఉంచడంతో యథావిధిగా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి.

పోలీసుల కళ్లుగప్పి ఖైదీ పరారీ

ప్రజాశక్తి - మార్కాపురం రూరల్

ఎస్కార్ట్ పోలీసుల కళ్ళుగప్పి రిమాండ్ ఖైదీ పరారైన ఘటన గురువారం మార్కాపురం మండల పరిధిలోని రాయవరం రైల్వేస్టేషన్‌లో చోటుచేసుకుంది. అందిన వివరముల ప్రకారం.. భువనేశ్వర్ నుండి బెంగళూరు వెళు తున్న ప్రశాంతి ఎక్స్‌ప్రెస్‌లో ఇద్దరు పోలీసులు రిమాండ్ ఖైదీని విశాఖ నుంచి అనంతపురం తీసుకెళ్తున్నారు. ఎస్కార్ట్ పోలీసులు నిద్రపోవడంతో మార్కాపురం రైల్వే స్టేషన్ దాటిన తర్వాత రిమాండ్ ఖైదీ పరారయ్యాడు. పరారైన ఖైదీ గుత్తి మండలం టి. కొత్తపల్లికి చెందిన వ్యక్తి. ఈయన గంజాయి రవాణా కేసులో పట్టుబడ్డాడు. ఈ క్రమంలో అనంతపురం 4వ పట్టణ పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న రామాంజనేయులు గుత్తి, ఉరవకొండ ప్రాంతాల్లో నిఘా ఉంచి నిందితుడి స్వగ్రామమైన ఉరవకొండలో ఖైదీని అదుపులోకి తీసుకున్నాడు. దీంతో అనంతపురం జిల్లా పోలీస్ అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

యాచకుడిని ఢీకొన్న వాహనం

ప్రమాదంలో నుజ్జయిన కాలు

ప్రజాశక్తి-చీరాల

యాచకుడుని బొలెరో వాహనంతో ఢీకొనడంతో కాలుభాగమంతా నుజ్జు నుజ్జయి తీవ్రంగా గాయపడిన సంఘటన గురువారం పట్టణంలోని రైల్వే స్టేషన్ ఆవరణంలో జరిగింది. అందిన వివరాల మేరకు.. వినుకొండ సమీపంలోని యేల్చూరు గ్రామానికి చెందిన కంచర్ల సుబ్బారావు అనే వృద్ధుడు గత రెండు సంవత్సరాలుగా చీరాల రైల్వేస్టేషన్, పరిసర ప్రాంతాలలో యాచిస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అతడు సాయంత్రం సమయంలో రైల్వేస్టేషన్ ఆవరణలోని ఫుడ్ కోర్టు వెనుక కూర్చుని భోజనం చేస్తున్నాడు. అయితే ఇంతలో ఓ బొలోరో వాహనం ఆకస్మాత్తుగా అతని కుడికాలుపైకి ఎక్కింది. ఈ సంఘటనలో అతని మోకాలు వరకు కండ పూర్తిగా ఊడిపోయి ఎముక బయటకు వచ్చింది. రక్తపు మడుగులో పడిన ఆ వృద్ధుడు పెద్దగా కేకలు వేయడంతో సమీపంలో ఉన్న ప్రయాణికులు, ఇతర పాదచారులు బొలెరో వాహనాన్ని నిలుదలచేసి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఒన్ టౌన్ ఏఎస్ఐ వెంకటేశ్వర్లు సంఘటన స్థలానికి చేరుకొని బొలెరో వాహన డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని బాధిత వృద్ధుడికి ప్రథమ చికిత్స అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆ యాచకుడి పరిస్థితి విషమంగా ఉంది.

రేపు సమాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-సంతమాగులూరు

ఈ నెల 20వ తేదీ శనివారం ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశం హాల్‌లో సమాచార చట్టంపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి లావణ్య తెలిపారు. ఏపీ సమాచార కమిషనర్ మౌఖిక ఉత్తర్వుల మేరకు ఈ సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు మండల స్థాయి అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొనాలని ఆమె కోరారు.

పౌష్టికాహారం పంపిణీ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండలం దేవరపల్లి గ్రామంలో రోటరీ క్లబ్ ఆఫ్ పర్చూరు సెంట్రల్, పర్చూరు అధ్యక్షుడు తోకల కృష్ణ మోహన్ ఆధ్వర్యంలో 12 మంది గర్భిణులు, బాలింతలకు డాక్టర్ల సిఫార్సు మేరకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు డాక్టర్ల సూచనలు, సలహాలు పాటిస్తూ ఆరోగ్యవంతమైన బిడ్డలకు జన్మ ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామస్థులు ఈ గ్రామానికి మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, గ్రామస్తులు, కార్యదర్శి కే ఆంజనేయులు, సభ్యులు పంబి సదానందరెడ్డి, నాగబైరు శ్రీనివాసరావు, కోటా శ్రీనివాసరావు, ఎఎన్ఎం జ్యోత్స్నదేవి. ఎంహెచ్ఎల్‌పి జయశ్రీ, ఆశా వర్కర్లు విజయకుమారి, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

తాతవారిపాలెంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని సూరేపల్లి పంచాయతీ పరిధిలో గల తాతావారిపాలెం గ్రామంలో జ్వరాలు అధికంగా ఉండటంతో భట్టిప్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని మాజీ ఎంపీపీ వాకా సుధాశేషుబాబు ప్రారంభించారు. వైద్యులు డిఎల్ పద్మజ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ వాకా శేషుబాబు, పంచాయతీ కార్యదర్శి అనురాధ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



మరమ్మతులకు గురైన వంతెన

కలగా సాగర్ కాలువపై రెండో వంతెన

నీటి మూటగా మంత్రి సురేష్ హామీ

ప్రజాశక్తి-త్రిపురాంతకం

ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న సాగర్ కాలువపై రెండో వంతెన నిర్మాణానికి మంత్రి సురేష్ ఇచ్చిన హామీ నీటి మూటగా మారింది. త్రిపురాంతకం పట్టణం నుంచి త్రిపురాంతకేశ్వర, బాల త్రిపుర సుందరీ దేవి ఆలయాలకు చేరుకోవడానికి ఒకే ఒక మార్గం ఉంది. ఆ మార్గంలో సాగర్ కుడి కాలువ ఉంది. కాలువ నిర్మాణ సమయంలోనే సుమారు 12 అడుగుల వెడల్పుతో వంతెన నిర్మించారు. ఇప్పటికీ త్రిపురాంతకం నుంచి ఆలయాలకు, చెర్లోపల్లి, మిట్టపాలెం, రామసముద్రం, లేళ్లపల్లి, దువ్వలి, యర్రగొండపాలెం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే ఈ వంతెన నుంచే ప్రయాణించాలి. దీనికి తోడు మహాశివరాత్రి ఉత్సవాల సమయంలో వంతెన వద్ద ట్రాఫిక్ నిలిచిపోతోంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు మూడు గంటల నుంచి ఐదు గంటల పాటు ట్రాఫిక్‌లో భక్తులు చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయి. దీంతో ఎన్నో ఏళ్ల నుంచి భక్తులు, ప్రజలు, వాహనదారులు వంతెనను వెడల్పు చేయాలని, రెండో వంతెనను నిర్మించాలని కోరుతున్నా అధికారులు కానీ, ప్రజా ప్రతినిధులు కానీ దీనిపై దృష్టి సారించలేదు. గత ప్రభుత్వ హయాంలో మంత్రిగా పనిచేసిన ఆదిమూలపు సురేష్ పలు మార్లు హామీ ఇచ్చినా ఆయన హామీ నీటి మూటగానే మిగిలింది. ప్రస్తుత టిడిపి ప్రభుత్వమైనా ప్రజల, భక్తుల, వాహనదారుల ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని సాగర్ కాలువ రెండో వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



అద్దంకిలో జడ్జి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు, కోర్టు సిబ్బంది



బాపట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

హెల్మెట్ తప్పకుండా ధరించాలి

జిల్లా జడ్జి బాలాజీ

ప్రజాశక్తి-బాపట్ల

ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ 6వ బాపట్ల జిల్లా జడ్జి కేపీ బాలాజీ అన్నారు. గురువారం రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు బాపట్ల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో హెల్మెట్ వినియోగంపై పట్టణంలో వన్ కే వాక్ ర్యాలీ నిర్వహించారు. ఏజీ కాలేజీ రోడ్డు ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి గడియారం స్తంభం సెంటర్ ద్వారా మున్సిపల్ కార్యాలయం వరకు సాగిన వన్ కే ర్యాలీని ఉద్దేశించి బాలాజీ మాట్లాడుతూ మోటార్ వాహనాల ప్రయాణాల్లో జరిగే ప్రమాదాల్లో దాదాపు హెల్మెట్ ధరించకపోవడం వల్లే అధికంగా మరణాలు సంభవిస్తున్నాయని అన్నారు. రహదారి ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడుకోవడానికి హెల్మెట్ వాడకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అదేవిధంగా ద్విచక్ర వాహనం ఇన్సూరెన్స్ లేని కారణంగా ప్రమాదాల్లో మరణించిన వారికి నష్టపరిహారం అందడం లేదన్నారు. ప్రధానంగా 18 యేళ్లు నిండని మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదని తల్లిదండ్రులకు సూచించారు. వన్ కే వాక్ ర్యాలీలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జ్ జి వాణి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జి రుక్మిణి, బాపట్ల జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు విన్నకోట సత్యప్రసాద్, జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్ సురేష్, బాపట్ల పట్టణ సిఐ ఉప్పు శ్రీనివాసులు, బాపట్ల ట్రాఫిక్ పోలీసులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

చీరాల: మైనర్లు వాహనాలు నడిపినా లేక మైనర్లకు వాహనాలు ఇచ్చి డ్రైవింగ్‌కు ప్రోత్సహించినా వారిపై చట్టపరమైన చర్యలు ఉంటాయని సీనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్మన్ ఎం సుధ అన్నారు. ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు గురువారం చీరాల మండల న్యాయ సేవాధికార సంస్థ వారి ఆధ్వర్యంలో స్థానిక కోర్టు భవనాల సముదాయం వద్ద ఏర్పాటు చేయబడిన ఒక కిలోమీటర్ ర్యాలీ ప్రారంభ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధ హాజరై పచ్చ జెండా ఊపి ఈ ర్యాలీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్క ద్విచక్ర వాహన చోదకుడు హెల్మెట్‌ని కచ్చితంగా ధరించాలన్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌కె రెహనా మాట్లాడుతూ యువత చట్టానికి అనుగుణంగా ప్రవర్తిస్తూ, క్రమశిక్షణతో మెలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్, ఎన్ శ్రీనివాసరావు, చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు జి రమేష్ బాబు, చీరాల మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ బి రామకృష్ణారెడ్డి, టూ టౌన్ సిఐ సోమశేఖర్, బార్ అసోసియేషన్ మహిళా ప్రతినిధి జీకే ఈశ్వరిరెడ్డి, సోషల్ వర్కర్, పిఎల్‌వీలు ఎస్‌డి మతీన్, డి ఇమ్మానియేల్, ఎస్‌కె మహబూబ్ సుభాని, పిఎల్‌విలు ఎం వినోద్, వై కరుణ బాబు, జె సాయికృష్ణ, వన్ టౌన్ ట్రాఫిక్ ఏఎస్ఐ సిహెచ్ శ్రీనివాసరావు, కోర్టు సిబ్బంది, పోలీసు సిబ్బంది, విజ్ఞాన భారతి, గౌతమి జూనియర్ కళాశాలల విద్యార్థులు, అధ్యాపకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



చీరాలలో జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి ఎం సుధ

రేపల్లె: ద్విచక్ర వాహన చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అవగాహన కల్పిస్తూ రేపల్లె కోర్టు సీనియర్ సివిల్ జడ్జి టి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో రేపల్లె పట్టణంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రేపల్లె పట్టణంలోని కోర్టు ఆవరణలో కోర్టు సీనియర్ సివిల్ జడ్జి టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ లేకపోవడం వలన ప్రాణాపాయాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేపల్లె పట్టణంలో న్యాయవాదులంతా కలసి హెల్మెట్ ధారణపై ద్విచక్ర వాహన చోదకులకు అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులతో పాటు రేపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షులు కేవీ గోపాలరావు ఉపాధ్యక్షులు భూషణం న్యాయవాదులు కోర్టు ఉద్యోగులు సిబ్బంది పారా లీగల్ వాలంటీర్లు సిహెచ్ నాగమల్లేశ్వరరావు, ఆర్ శ్రీనివాసరావు, ఎం నాగమల్లేశ్వరరావు, ఆయా కోర్టుల ఉద్యోగులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అద్దంకి: ద్విచక్ర వాహనదారులు సురక్షితంగా ఇంటికి చేరాలంటే తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని న్యాయమూర్తి డి నాగ వెంకట లక్ష్మి అన్నారు. హెల్మెట్ ధరించడంపై అవగాహన కోసం ర్యాలీ గురువారం నిర్వహించారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. హెల్మెట్ ధరించని విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ఎంతోమంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని న్యాయమూర్తి డి నాగ వెంకటలక్ష్మి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. హెల్మెట్ ధరించి మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గౌరవ హైకోర్టు వారి ఆదేశాల మేరకు హెల్మెట్ ధరించడం అనే విషయంపై కోర్టు సముదాయ భవనాల నుంచి ఈ ర్యాలీ బయలుదేరినది. సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి డి నాగ వెంకటలక్ష్మి ఈ కార్యక్రమాన్ని జండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి జె సీత, అడిషనల్ జూనియర్ జడ్జి ఎస్ ప్రియదర్శిని, నూతక్కి పాల్గొన్నారు. న్యాయవాదులు, న్యాయవాద గుమస్తాలు, పారా లీగల్ వాలంటీర్లు, ప్రకాశం ప్రభుత్వ కళాశాల, హై స్కూల్ విద్యార్థులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

పర్చూరు: ద్విచక్ర వాహనదారులు ప్రయాణాల్లో హెల్మెట్ ధరిస్తే ప్రాణాలను కాపాడుకోవచ్చని పర్చూరు కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ప్రశాంతి అన్నారు. అందరూ తప్పనిసరిగా హెల్మెట్లను ధరించాలని కోరారు. గురువారం స్థానిక కోర్టు నుంచి బొమ్మల సెంటర్ వరకు న్యాయవాదులు, సిబ్బందితో ఆమె ర్యాలీ నిర్వహించారు. 'హెల్మెట్ ప్రాణాలు కాపాడుతుంది' అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ చెమట పడుతోందని, ఎగతాళి చేస్తారని ప్రయాణం మధ్యలో హెల్మెట్లని తీయవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు ఒగ్గిశెట్టి గోవింద రాజులు, యార్లగడ్డ రాఘవయ్య చౌదరి, కొమ్మాలపాటి రవి, రావి శ్రీనివాసరావు, ఎస్ఐ జివి చౌదరి, పోలీసులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వం నమోదు ప్రారంభం

ప్రజాశక్తి-వేటపాలెం

చీరాల నియోజకవర్గంలో జనసేన సభ్యత్వ నాలుగో విడత నమోదు కార్యక్రమాన్ని గురువారం జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు అట్టహాసంగా ప్రారంభించారు. వేటపాలెం లోని 216 జాతీయ రహదారిలోని గాయత్రి రెస్టారెంట్ ఎదురుగా ఉన్న ప్రాంగణంలో జనసేన నాలుగో విడత సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని జనసేన సెంట్రల్ ఆంధ్ర ప్రోగ్రాం కన్వీనర్ ఆలా అనిల్‌కుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని జనసేన కార్యకర్తలు అందరూ సభ్యత్వ నమోదు చేసుకోవడం వలన వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా చేకూరుతుందని తెలియజేశారు. అలానే జన సైనికుని భద్రత జనసేన పార్టీ బాధ్యతగా భావించి జనసేన కార్యకర్త ప్రమాదవశాత్తు మరణిస్తే ఐదు లక్షల బీమా భద్రతను జనసేన పార్టీ కల్పించిందని అన్నారు. జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఆమంచి స్వాములు మాట్లాడుతూ రాష్ట్రంలోనే చీరాల నియోజకవర్గం సభ్యత్వ నమోదులో మొదటి స్థానంలో ఉండే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో దాదాపు 500 వరకు సభ్యత్వ నమోదు చేయడంతో పాటు రెండువేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మామిడాల శ్రీనివాసరావు, వేటపాలెం జనసేన పార్టీ మండల అధ్యక్షులు ఉగ్గిరాల మార్కండేయులు, జనసేన పార్టీ ఉమ్మడి ప్రకాశం జిల్లా కార్యదర్శి గూడూరు శివరాం ప్రసాద్, కటారిపాలెం జనసేన నాయకులు లక్ష్మయ్య, తాతయ్య, వాకావారిపాలెం కృష్ణ, వీర మహిళలు పద్మిని, భారతి, జన సైనికులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆమంచి స్వాములు

అన్ని గ్రామాల్లో 'ఉపాధి హామీ'

ప్రజాశక్తి-ముండ్లమూరు

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు అన్ని గ్రామాలలో మొదలు పెట్టాలని ఎంపీడీవో రావూరి జనార్ధన్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు అడిగిన వారందరికీ పనులు కల్పించాలని అన్నారు.కార్యక్రమంలో ఏపీఓ నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఆపేందుకు చర్యలు తీసుకోవాలని..

మంత్రి స్వామికి వినతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ రైల్వే స్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేయాలని కోరుతూ రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అప్డేట్స్ కమిటీ సభ్యులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శింగరాయకొండలో నవజీవన్, అహ్మదాబాద్ – చెన్నై, జన శతాబ్ధి, విజయవాడ – చెన్నై , హౌర, హౌరా – బెంగళూరు , నర్సాపూర్, నర్సాపూర్– ధర్మవరం ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రులు కె.రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ సహకారంతో శింగరాయకొండలో ఎక్స్‌పెస్ రైళ్లు నిలుపుదల చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అందుకు మంత్రి స్వామి సానుకూలంగా స్పందించారు. కేంద్ర మంత్రుల మాట్లాడి శింగరాయకొండలో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలుపుదల చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కూనపురెడ్డి సుబ్బారావు, వార్డు మెంబర్లు పడిదపు రవికుమార్, ఓలేటి రవిశంకర్‌రెడ్డి, మేకల నరేష్, ఆలా నాగమణి, అప్డేట్స్ కమిటీ సభ్యులు కాక సాయితేజ, చెన్నంశెట్టి హరి బాబు తదితరులు పాల్గొన్నారు.




మంత్రి స్వామికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

మద్దాళి మాధవరావుకు పురస్కారం

ప్రజాశక్తి-చీమకుర్తి

అభయసేవా పౌండేషన్ అధ్యక్షుడు మద్దాళి మాధవరావు నట సామ్రాట్ భూషణ్ పురస్కారం అందు కున్నారు. శ్రీశైలం దేవస్థానంలోని కళావేదిక ప్రాంగణంలో ఎల్‌సిఎస్ పౌండేషన్ మరియు లిటిల్ చాంప్స్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మద్దాళికి గురువారం పురస్కారాన్ని అందజేశారు. మద్దాళి మాధవరావు గత ఇరవై ఏళ్లుగా వివిధ రంగాలలో అందిస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు అందజేశారు. శ్రీశైల దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు, ఎన్‌హెచ్ ఆర్‌ఐ వర్కింగ్ అధ్యక్షుడు రామచందర్, తెలంగాణా అధ్యక్షుడు శేఖర్, ఇమ్మడిశెట్టి హనుమంతరావు చేతుల మీదుగా పురస్కారం, ప్రశంశాపత్రం అందజేసి సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో విద్యావేత్త కొలకలూరి రవిబాబు, సినీగేయ రచయిత డాక్టర్ మధురశ్రీ, షేక్ నాసిర్ అహమ్మద్ పాల్గొన్నారు.



పురస్కారం అందుకుంటున్న మాధవరావు

దాతల సహకారం మరువలేనిది : ఎంఇఒ

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని ఎంఇఒ ఆవుల శ్రీనివాసరావు తెలిపారు. శింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని శ్రీరామ్ నగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎన్‌ఆర్ఒ ముల్లా బాలాజీ తన తండ్రి కీర్తిశేషులు ముళ్ళ బికారి జ్ఞాపకార్ధకంగా నోట్ పుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ దాతల సహకారం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతున్నాయన్నారు. ఎన్‌ఆర్‌ఐ ముల్లా బాలాజీ రూ.10వేల విలువైన నోట్ పుస్తకాలు, నాలుగు రకాల కాపీ రైటింగ్ బుక్స్, లెక్కల వర్క్ బుక్స్, డ్రాయింగ్ బుక్స్, స్టేషనరీ అందజేసి నందుకు ఆయనకు అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టి. సుజాత, ఉపాధ్యాయులు ఎం.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ దాతల సహకారంతో పాఠశాల అభివద్ధి కృషి చేస్తామని తెలిపారు. పాఠశాల చుట్టూ ప్రహరీ, గేట్లు ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విద్యా కమిటీ చైర్మన్ నాగలక్ష్మి



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న దాత

అండాశయంలో నీటి బుడగలతో ..

గర్భధారణకు ఆటంకం

- డాక్టర్ చాపల శాంతకుమారి
- గర్భకోశ, ప్రసూతి, సంతాన సాఫల్య సీనియర్ వైద్య నిపుణులు
- శ్రీరామ్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, ఒంగోలు



ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పెళ్లైయిన ప్రతి యువతి తాను తల్లిని కావాలని, అమ్మ అని పిలిపించుకోవాలని ఆరాటపడుతుంది. అది కొందరికి వెంటనే సాధ్యమవుతుంది.కొందరిలో వివిధ కారణాల వల్ల ఆలస్యమవుతుంది. అండాశయంలో నీటి బుడగల కారణంగా కొందరికి గర్భధారణకు ఆటంకంగా మారుతుంది. అండాశయంలో నీటి బుడగలు ఉన్నవారు సైతం వైద్యచికిత్స పొంది సంతానం కని తమ కలలను సాకారం చేసుకోవచ్చు.

కొందరు మహిళల్లో నెలసరి (పీరియడ్స్) సక్రమంగా రావు. రెండు లేదా మూడు నెలలకు ఒకసారి వస్తాయి. మందులు వినియోగిస్తేనే కొందరికి నెలసరి వస్తుంది. అండాశయంలో నీటి బుడగల కారణంగానే ఇలా జరగవచ్చు. స్కానింగ్ ద్వారా నీటి బుడగలను గుర్తించవచ్చు.

సాధారణంగా మహిళ అండాశయంలో 8 నుంచి 10 ఎగ్స్ ఉంటాయి. అంత కంటే ఎక్కువ కలిపిస్తే వాటిని నీటి బుడగలుగా పేర్కొనవచ్చు. నీటి బుడగలు ఉన్నవారిలో మొహంపై మొటిమలు వస్తాయి. జుట్టు రాలుతుంది. మొహం, చెస్ట్ మీద అవాంచిత రోమాలు వస్తాయి. హార్మోన్లు బ్యాలెన్స్‌గా ఉండవు. ఎగ్స్ ప్రతి నెలా సెల్టన్ అయి పెరగవు. కొద్ది కొద్దిగా పెరిగి విడుదల కావు. ఆలస్యంగా విడుదల అవుతుంది. ఒక్కొక్క సారి విడుదల కాకపోవచ్చు. ఇలాంటి వారు గర్భం దాల్చే అవకాశం ఉండదు. అధిక బరువు పిసిఒడి వల్ల ఇలాంటి సమస్య రావచ్చు. అధిక బరువు వల్ల హార్మోన్లు బ్యాలెన్స్ తప్పుతాయి. దీంతో పిసిఒడి వస్తుంది.

పిసిఒడిని ఇలా గుర్తించాలి

నెలసరి క్రమం తప్పకుండా వస్తున్నా అధిక బరువు పెరుగుతారు. స్కాన్‌లో చూసినప్పుడు పాలిటిసీ ఒవిడెంట్ ఫ్యాట్ కనిపిస్తుంది. పిసిఒడి ఉన్నవారిలో సంతానలేమికి దారి తీస్తుంది. పిరియడ్ సక్రమంగా వచ్చేవారు ఏడాదిలో 12 సార్లు గర్భం దాల్చే అవకాశం ఉంటుంది. ఒక వేళ మూడు నెలలకు ఒకసారి పిరియడ్స్ వచ్చేవారిలో నాలుగు సార్లు గర్భం దాల్చే అవకాశం వస్తుంది. ఎగ్ విడుదల గురించి తెలియదు కాబట్టి ఆ సమయంలో భార్యభర్తలు కలవకపోతే గర్భదారణ ఆలస్యం మరింత అవుతుంది.

పిసిఒడి చికిత్స ఇలా..

పిసిఒడి చికిత్స చాలా సాధారణం. జీవన విధానం మార్చుకుంటే చాలామందిలో గర్భం వచ్చే అవకాశం ఉంది. బరువులో 5 శాతం తగ్గితే పిరియడ్స్ సక్రమంగా వస్తాయి. ఎగ్ కూడా రెగ్యులర్‌గా విడుదల అవుతుంది. అందువల్ల గర్భం వచ్చే అవకాశం ఉంది.

వ్యాయామం చేయాలి

ప్రతిరోజూ 45 నిమిషాల పాటు ఎక్సర్‌సైజ్‌లు, వాకింగ్ చేయాలి. డైట్ కంట్రోల్ చేసుకోవాలి. కొవ్వులేని పదార్ధాలు తీసుకోవాలి. నీరు ఎక్కువగా తాగాలి. జింక్ పుడ్‌లకు దూరంగా ఉండాలి. మంచి షౌష్టికాహారం తీసుకోవాలి. ఇలా చేస్తే పిరియడ్ రెగ్యూలర్‌గా వచ్చి గర్భం దాల్చే అవకాశం ఉంటుంది.

అందుబాటులో ట్యాబ్‌లెట్స్

ఎగ్స్ రెగ్యులర్‌గా రావటానికి కొన్ని ట్యాబ్‌లెట్స్ ఉన్నాయి. ఈ ట్యాబ్‌టెల్స్ 5 రోజులకు ఇస్తారు. పిరియడ్స్ వచ్చి రెండు లేదా మూడో రోజు నుండి మింగాలి. ట్యాబ్‌లెట్ తీసుకోవడం వల్ల ఎగ్ పెరుగుతుంది. ట్యాబ్‌లెట్స్ ద్వాఆ ఎగ్ పెరగనివారికి ఇంజక్షన్ ఇస్తారు. ట్యాబ్‌లెట్స్, ఇంజెక్షన్ ద్వారా రెస్పాండెంట్ కాని వారికి లాప్రోస్కోపి సర్జరీ చేయాల్సి ఉంటుంది. ఈ సర్జరీ ద్వారా అండాశయంలోని నీటి బుడగలను పగులగొడటారు. తర్వాత ట్యాబ్‌లెట్స్, ఇంజక్షన్లు ద్వారా ఓబినేషన్ జరిగేలా చూస్తారు. ఆ సమయంలో భార్యభర్తలు కలవాల్సి ఉంటుంది. ఇవన్నీ చేసినా 5 శాతానికి మించి రెస్పాండెంట్ కాకపోతే వారిని టెస్ట్‌ట్యూబ్‌కి రిఫర్ చేస్తారు.



ఎస్‌పి దామోదర్‌తో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

ఎస్‌పిని కలిసిన ఎమ్మెల్యే ఉగ్ర

ప్రజాశక్తి -కనిగిరి

ప్రకాశం జిల్లా ఎస్‌పి దామోదర్‌ను ఆయన కార్యాలయంలో కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువా, పూలమాలతో సత్కరించి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి హనుమంతుని పాడు మండల మాజీ అధ్యక్షుడు గాయం తిరుపతిరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి మువ్వ రంగసాయి యాదవ్, నాయకులు నారపరెడ్డి శ్రీనివాసరెడ్డి, నారపరెడ్డి వెంకటరెడ్డి, పోలం రెడ్డి రామకష్ణారెడ్డి, భోగాల ప్రసాద్, నారపరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.



ఎస్‌పి మొక్క అందజేస్తున్న దామచర్ల సత్య

ఎస్‌పికి దామచర్ల సత్య అభినందనలు

ప్రజాశక్తి-టంగుటూరు

ప్రకాశం జిల్లా ఎస్‌పి దామోదర్‌ను టిడిపి రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య గురువారం మర్యాద పూర్వకంగా గురువారం కలిశారు. ఈ సందర్భంగా మొక్క అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పలు గురించి ఎస్‌సి, దామచర్ల సత్య చర్చించారు.



ఎస్‌పి పుష్పగుచ్చం అందజేస్తున్న గొట్టిపాటి లక్ష్మి

ఎస్‌పిని కలిసిన గొట్టిపాటి లక్ష్మి

ప్రజాశక్తి-దర్శి

జిల్లా ఎస్‌పి దామోదర్‌ను టిడిపి కూటమి దర్శి నియోజక వర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, కడియాల లలిత సాగర్ గురువారం మర్యాద పూర్వ కంగా కలిశారు. పుష్పగుచ్చం అందజేసి అభినందలు తెలిపారు. దర్శి నియోజకవర్గంలో శాంతి భద్రతలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పొగాకు బేళ్ల అమ్మకం

ప్రజాశక్తి-టంగుటూరు : టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి మల్లవరప్పాడు, శివపురం, గొర్లమిట్ట, ఆలకూరపాడు, రావివారిపాలెం, అనంతవరం, పాలేటిపాడు, జయవరం గ్రామాలకు చెందిన రైతులు 538 పొగాకు సూర, ముక్క బేళ్లను గురువారం తీసుకొచ్చారు. అందులో 502 బేళ్లు అమ్ముడు పోయాయి. వివధ కారణాల చేత 36 బేళ్లను తిరస్కరించారు. కిలో సూర, ముక్క పొగాకు అత్యధిక ధర రూ. 143, అత్యల్ప ధర రూ.60, సరాసరి రూ. 98.83 పైసలు పలికినట్లు వేలం కేంద్రం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు.

వీల్‌చైర్ బహూకరణ

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం ఎడమ కల్లు గ్రామానికి చెందిన మరియమ్మ అనే దివ్యాంగురాలికి బుధవారం దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు లుక్కు శరత్ బాబు వీల్‌చైర్ అందజేశారు. మరియమ్మ పుట్టుకతోనే పోలియోతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు ఈమెకు సేవ చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మరియమ్మ ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్థులు దివ్య హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు కారుమంచి చిన్న పేరయ్య, సుమన్, రామ్మోహన్, అనిల్, నాగేంద్ర, శివ, తదితరులు పాల్గొన్నారు.

వాకర్లు అందజేత

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని పెద్ద కొలుకుల గ్రామ పంచాయతీ పరిధిలో గల చెన్నరాయునిపల్లిలో రెడ్డిపాగు శేషమ్మకు నడుము బెల్టు, వాకర్ అందజేశారు. మందా చిన్న కోటమ్మ వయసు పైబడి నడవటానికి ఇబ్బందికరంగా ఉండడంతో ఆమెకు కూడా వాకర్ అందజేశారు. ఈ సందర్భంగా పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆశా కార్యకర్తల ద్వారా గ్రామంలో సర్వే చేయించి ఇంకా అవసరమైన వారిని గుర్తించి పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది నలగాటి వెంకట్రామయ్య నాయుడు, ఏ.చంద్రా నాయక్, బాషా, ఆశా కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వర్షాకాలంలో వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ రామావత్ అరుణాబాయి అన్నారు. గురువారం ఆమె స్వయంగా పంచాయతీ కార్మికులను తీసుకెళ్లి పట్టణంలోని డివైడర్లపై ఉన్న చెత్తాచెదారాన్ని తొలగించి శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా అరుణాబాయి మాట్లాడుతూ వ్యాపార సంస్థలు, ఇళ్లలోని వ్యర్థాలను పంచాయతీ అధికారులు ఇచ్చిన తడి, పొడి డబ్బాలలో నిల్వ ఉంచి ప్రతిరోజూ చెత్త డబ్బాలో వేయాలని సూచించారు. అలా చేయకుండా రోడ్లపైన, డివైడర్లపైన వేయడం ద్వారా దుర్వాసన రావడంతో పాటు దోమలు పెరిగే అవకాశం ఉందన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

పాలంక తిరుణాళ్లలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల పాలంక వీరభద్రస్వామి తిరుణాలలో గురువారం పాలుట్ల ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి.చంద్రశేఖర్ ఆధ్వర్యంలో భక్తులకు వైద్య శిబిరం నిర్వహించారు. ముందస్తు జాగ్రత్తలో భాగంగా మలేరియా జ్వరం రాకుండా మాత్రలు పంపిణీ చేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. భక్తులకు పలు ఆరోగ్య సూత్రాలు, జాగ్రత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది మాధవీలత, నలగాటి వెంకట్రామయ్య నాయుడు, ఏ చంద్రా నాయక్, బాషా తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు తీసుకోవాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

అర్హత కలిగిన ప్రతి కౌలు రైతు గుర్తింపు కార్డులు తీసుకోవాలని వ్యవసాయాధికారి డి.జవహర్‌లాల్ నాయక్ అన్నారు. గురువారం మండలంలోని యడవల్లి, దోర్నాల-3 రైతు సేవా కేంద్రాల్లో కౌలు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 నెలల కాల వ్యవధితో కూడిన సిసిఆర్‌సి కార్డులు తీసుకోవడం ద్వారా కౌలు రైతులకు రైతు భరోసా వర్తిస్తుందని చెప్పారు. పంట నష్టపరిహారం కూడా పొందవచ్చన్నారు.

నిరుపయోగంగా సచివాలయ భవనం

వసతులు కల్పించడకుండానే ప్రారంభం

శిథిలావస్థకు చేరిన పాత భవనం

తర్లుపాడు-ప్రజాశక్తి

మండల కేంద్రమైన తర్లుపాడులో సచివాలయ భవనం నిరుపయోగంగా ఉంది. భవన నిర్మాణం పూర్తికాకుండా కనీస వసతులు కల్పించకుండా గత ప్రభుత్వం ఎన్నికలకు నెల ముందుగా ప్రారంభించిందని ప్రజలు విమర్శిస్తున్నారు. రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయ భవనాన్ని ఎన్నికలకు నెల ముందు అప్పటి ఎమ్మెల్యే కుందురు నాగార్జున రెడ్డి చేతుల మీదుగా ఆర్భాటంగా ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవంలో మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొన్నారు. కానీ పూర్తిస్థాయిలో సౌకర్యాలు ఏర్పాటు చేయకపోవడంతో నేటికీ దాన్ని వినియోగించకుండా పక్కన పెట్టారు. సిబ్బంది పాత భవనంలోనే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం, దీనికి తోడు ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో, సిబ్బంది విధి లేని పరిస్థితుల్లో భయాందోళనలో విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. నూతన సచివాలయ భవనం ముందు అధ్వానంగా చెత్తాచెదారాలు,



ప్లాస్టిక్ వ్యర్థాలు దర్శనమిస్తున్నా పంచాయతీ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అధికారులకు కాంట్రాక్టర్‌తో ఉన్న లావాదేవీల కారణంగానే భవన నిర్మాణం త్వరగా పూర్తిచేయాలని ప్రశ్నించకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. అసలు పూర్తి చేయకుండా ఎలా ప్రారంభిస్తారంటూ గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రజలకు అందుబాటులో నూతన సచివాలయంలో సిబ్బంది విధులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వైసీపీ ఐదేళ్ల పాలనలో అంతా అవినీతే

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అవినీతి మయంగా మారిపోయిందని టిడిపి నియోజకవర్గ ఇంచార్జి గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. గురువారం యర్రగొండపాలెంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో జరిగిన అక్రమాలు, దోపిడిలపై ప్రజలకు వాస్తవాలు తెలియజేసేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్వేత పత్రాలను విడుదల చేసిందని తెలిపారు. వైసీపీ పాలకులు ఏ విధంగా అక్రమాలు, దందాలు చేశారో, ఎంత దోచుకున్నారో ఆధారాలతో సహా శ్వేత పత్రాల ద్వారా బయట పెడుతున్నామన్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన భయంకరమైన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు చేసినట్లు చెప్పారు. యర్రగొండపాలెం నియోజకవర్గంలో హౌసింగ్ కాలనీల్లో అనేక అక్రమాలు జరిగాయన్నారు. నియోజకవర్గంలో ఇసుక తిన్న అక్రమార్కుల నుంచి వాటిని కక్కిస్తామన్నారు. భూదందాలకు పాల్పడిన వారి చిట్టాను ఆధారాలతో సహ



మాట్లాడుతున్న ఎరిక్షన్‌బాబు

బయట పెడతామన్నారు. ప్రభుత్వ భూములు, స్థలాలు ఆక్రమించిన వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ చేకూరి సుబ్బారావు, నాయకులు కంచర్ల సత్యనారాయణ గౌడ్, బివి సుబ్బారెడ్డి, తోటా మహేష్ నాయుడు, కోటయ్య, చిట్టేల వెంగళరెడ్డి, కొత్తమాసు సుబ్రమణ్యం, షేక్ మస్తాన్‌వలి, మంత్రూ నాయక్, కామేపల్లి వెంకటేశ్వర్లు, ఆతుకూరి క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను పాఠశాలలో చేర్పించాలి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

ఐదు సంవత్సరాలు పైబడిన పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో బి.మస్తాన్ నాయక్ అన్నారు. ఆయన అధ్యక్షతన గురువారం పెద్దదోర్నాలలోని విద్యావనరుల కేంద్రంలో ప్రధానోపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమాచారాన్ని యుడైస్ యాప్‌లో నమోదు చేయాలన్నారు. సకాలంలో సిలబస్ పూర్తి చేయాలని తెలిపారు. మెనూ ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. వంట పాత్రలను పరిశుభ్రంగా ఉంచి వంట చేసేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో



మాట్లాడుతున్న ఎంఈవో మస్తాన్ నాయక్

ఎంఈవో-2 కొండలరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

శాంతి నగర్ గిరిజన గూడెంలో దాహం కేకలు

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం మండలంలోని దట్టమైన నల్లమల అటవీ ప్రాంతంలో గల శాంతి నగర్ గిరిజన గూడెంలోని చెంచు గిరిజనులు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. గత్యంతరం లేక కిమీ దూరంలో ఉన్న పొలాలకు వెళ్లి వ్యవసాయ బోర్ల దగ్గర నీటిని తెచ్చుకొని కాలం గడుపుతున్నారు. గాంధీ నగర్, దద్దనాల, తెలుగురాయుని చెరువు గూడేలకు చెందిన గిరిజనులు శాంతి నగర్ చెంచు గూడేనికి వచ్చి అక్కడే నివాసం ఉంటున్నారు. మొత్తం 200 కుటుంబాల చెంచులు అక్కడ నివాసం ఉంటున్నారు. వారి కోసం సింగిల్ ఫేస్ బోరు ఏర్పాటు చేసినప్పటికీ నీళ్లు రాక మొరాయించింది. దీంతో వాళ్లకు నీటి కష్టాలు అధికమయ్యాయి. సమస్యను ఐటీడీఏ



పొలాల్లో నీళ్లు పట్టుకుంటున్న దృశ్యం

అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వీటీడీఏ ప్రెసిడెంట్లు కె.అంకన్న, పి.నాగన్న, కె.పోతురాజు, బి.వెంకటేశంలు ఆరోపించారు. నీటి సమస్యను పరిష్కరించి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఘనంగా పీర్ల పండుగ

ప్రజాశక్తి-కొమరోలు

కొమరోలు మండలం ద్వారకచర్లలో గురువారం తెల్లవారుజామున పీర్ల పండుగ పెద్ద సరిగేసు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలో పీర్ల చావిడి వద్ద తంగెళ్ల స్వామి పెద్దేవుడు అను పీర్లను పట్టుకొని నిప్పుల గుండంలో నడిచి పలువురు తమ భక్తిని చాటుకున్నారు. ముందుగా ఆ గ్రామంలో పీర్లను ఊరేగించారు. మహిళలు పీర్లకు నీళ్లు పోసి మొక్కులు తీర్చుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా చావిడి ముజావరీ షేక్ ఖాదర్ వళి అలియాస్ చిత్రసాబు మాట్లాడుతూ మా గ్రామంలో గత బ్రిటిష్ కాలం నుండి పీర్లు ఉండేవన్నారు. వాటిని ఎంతో భక్తితో హిందూ ముస్లింలు సమానంగా ఐక్యతతో జరుపుకునే పండుగ అని అన్నారు. గ్రామంలో ఎటువంటి పండగలు జరుపుకున్నా హిందూ ముస్లింలు ఐక్యతతో జరుపుకునే వాళ్ళమని ఎంతో ఆనందంతో చెప్పారు. గ్రామంలో ఉమామహేశ్వరాలయం, మసీదు పక్కపక్కనే ఉండటం ాగ్రామంలో హిందూ ముస్లింలకు స్నేహభావానికి అద్దం పడుతోందని తెలిపారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

మొహర్రం వేడుకల్లో ఎమ్మెల్యే తాటిపర్తి

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

మండలంలోని చింతల అగ్రహారంలో బుధవారం రాత్రి జరిగిన మొహరం వేడుకల్లో ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీకగా మొహరం పండుగను జరుపుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, ఎంపిపి భర్త గుమ్మా యల్లేష్ యాదవ్, నాయకులు రమణారెడ్డి, సుబ్బారెడ్డితో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండలంలోని ఐనముక్కల, చింతల అగ్రహారం, తిమ్మాపురం, చెర్లోపల్లి గ్రామాలలో గురువారం మొహరం వేడుకలు ఘనంగా జరిగాయి. పీర్లను గ్రామాలలో ఊరేగింపు చేశారు. వివిధ రకాల వేషధారణలు వేసి పలువురు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు వేడుకల్లో పాల్గొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై అంకమరావు ఆధ్వర్యంలో పోలీసులు గ్రామాలలో బందోబస్తు నిర్వహించారు.



కందులను పరామర్శిస్తున్న ఉగ్ర

ఎమ్మెల్యే కందులకు... కనిగిరి ఎమ్మెల్యే ఉగ్ర పరామర్శ

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డిని కనిగిరి ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి గురువారం పరామర్శించారు. ఇటీవల కందుల నారాయణరెడ్డి కాలికి శస్త్ర చికిత్స చేయించుకున్నారు. మార్కాపురంలోని కందుల నివాస గృహంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. కందుల నారాయణరెడ్డి ఆరోగ్య విషయాలు ఉగ్ర నరసింహారెడ్డి అడిగి తెలుసుకున్నారు. త్వరగా కొలుకోవాలని ఆకాంక్షించారు.

సంఘటిత పోరాటాలు పెంచాలి

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు పిలుపు

ప్రజాశక్తి-పొదిలి

కార్మికులు తమ సమస్యల పరిష్కారానికి సంఘటిత పోరాటాలు పెంచాల్సిన అవసరం ఉందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు అన్నారు. గురువారం పొదిలి పట్టణంలోని కాటూరివారిపాలెం కళ్యాణ మండపంలో జరుగుతున్న సిఐటియు ప్రకాశం జిల్లా శిక్షణా తరగతులు రెండో రోజు డికెఎం రఫీ అధ్యక్షతన జరిగాయి. ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఏవి నాగేశ్వరరావు మాట్లాడుతూ మోడీ మూడవసారి అధికారంలోకి వచ్చిన తరువాత సంస్కరణలు వేగవంతంగా అమలు చేస్తామని అంటున్నారని, కార్మికులను ఐక్యం చేసి పోరాటాలు నిర్మించడం ద్వారా వాటిని తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఇప్పటికే అమలు చేస్తున్న నయా ఉదార వాధ సంస్కరణల ఫలితంగా కార్మికులకు ఉద్యోగ భద్రత లేకుండా పోయిందన్నారు. 29 రకాల కార్మిక చట్టాల రద్దు వలన బ్రిటిష్ పాలన నుంచి పోరాడి సాధించుకున్న కార్మిక హక్కులైన 8 గంటల పని, పిఎఫ్,ఇఎస్ఐ, ఫించన్ విధానం, సమ్మె హక్కు, పారిశ్రామిక వివాదాల చట్టం తదితర అంశాలను తొలగించడంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలలో కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, గౌరవ వేతనం పేర్లతో తక్కువ వేతనాలు ఇవ్వడం, ఉద్యోగ, కార్మికులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంస్కరణల వలనే తీసుకువచ్చి అమలు చేస్తున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు ప్రవేటీకరణ గురించి మోడీ నోరు విప్పాలని, ప్రవేటికరణ, ప్రపంచీకరణ వలన రైతులకు మద్దతు ధర రావడం లేదని, జిఎస్‌టి, పన్నులు, నిత్యావసర సరుకులు, గ్యాసు ధరలు పెంచడం వల్ల కార్మికులకు నిజ వేతనాలు రావడం లేదన్నారు. ఈ ఉదార విధానాల వలన కార్మిక, రైతు, ఉద్యోగ, వ్యవసాయ కార్మికులు అప్పులపాలవుతున్నారని, ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలు పెంచాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మోడీ ప్రభుత్వం వచ్చిన 10 సంవత్సరాలలో అసమానతలు బాగా పెరిగాయని, కార్పోరేట్ శక్తులకు రూ.16 లక్షల కోట్లు రాయితీలు ఇచ్చి, కార్మిక, కర్షకులపై భారాలు వేశారని విమర్శించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి యం.రమేష్ మాట్లాడుతూ నూతనంగా వచ్చిన తెలుగుదేశం ప్రభుత్వం చిరు ఉద్యోగులైన మధ్యాహ్న భోజనం, మున్సిఫల్, ఆశా, పంచాయితీ, అంగన్ వాడీలను తొలగిస్తామని, రాజీనామాలు చేయాలని నాయకులు వేధింపులు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నామని, ఈ వేధింపులు ఆపకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు


ఇంటింటి సర్వే చేస్తున్న వైద్యులు, సిబ్బంది

కుష్టు వ్యాధిపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-పొదిలి

కుష్టువ్యాధిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ వైద్యులు శరత్‌చంద్ర అన్నారు. గురువారం పట్టణంలోని ఒకటవ సచివాలయం పరిధిలోని తూర్పు పాలెంలో కుష్టు వ్యాధి నివారణలో భాగంగా ఇంటింటి సర్వే కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ కుష్టు వ్యాధి లక్షణాలను తెలుసుకోవడం ద్వారా దాని నివారణకు తగిన జాగ్రత్తలు తీసుకోవచ్చున్నారు. ఈ నెల 18 నుండి ఆగ ష్టు 2వ తేదీవరకు ఈ సర్వే కార్యక్రమం జరుగుతుందన్నారు. తమ వద్దకు వచ్చే ఆరోగ్య సిబ్బందికి ప్రజలు సహకరించి వివరాలు తెలపాలన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

నగరంలో 33/11 వెంకటేశ్వర కాలనీ సబ్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు 33 కెవి కొత్త విద్యుత్ లైన్ల పనుల కారణం వల్ల విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని డిఇఇ జి.వినయ్‌కుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటేశ్వర కాలనీ, ఉడ్ కాంప్లెక్స్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలి

జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష

ప్రజాశక్తి-పొదిలి

వాహనచోదకులు ప్రతి ఒక్కరూ ప్రయాణ సమయంలో తలకు తప్పనిసరిగా హెల్మెట్ ధరించి.. ప్రాణాలు కాపాడుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష అన్నారు. గురువారం ప్రకాశం జిల్లా న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు ప్రమాదాలపై అవగాహన కార్యక్రమం సందర్భంగా కోర్టు ప్రాంగణం నుండి విశ్వనాథపురం సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జూనియర్ సివిల్ జడ్జి ప్రత్యూష మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణ మన చేతుల్లో ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు, ఎస్సై జి కోటయ్య, పోలీసు సిబ్బంది, బార్ అండ్ అసోసియేషన్ సభ్యులు, వివేకానంద కళాశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచి చెక్‌పవర్ తాత్కాలికంగా నిలిపివేత

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని దొడ్డవరం గ్రామ సర్పంచ్ పూనూరి సుబ్బారావు చెక్ పవర్‌ను వారం రోజుల పాటు తాత్కాలికంగా నిలుపుదల చేసినట్లు జిల్లా పంచాయతీ అధికారి టి.ఉషారాణి గురువారం నోటీసును జారీ చేశారు. గ్రామ పంచాయతీలోని నీటి పన్నుల వసూళ్లలో జరిగిన అవకతవకలపై వారం రోజుల్లో వివరణ ఇవ్వాలని సర్పంచ్ పూనూరి సుబ్బారావుకు ఆదేశాలు జారీ చేశారు. ఇకపై పంచాయతీ నుంచి ఎలాంటి లావాదేవీలు జరగాలన్న మద్దిపాడు ఈవోఆర్డీ అనుమతులు తప్పనిసరిగా ఉండాలని నోటీసులో పేర్కొన్నారు.

71వ సారి రక్తదానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని జిజిహెచ్‌లో నాగమణి అనే మహిళకి డెలివరీ కోసం అత్యవసరంగా రక్తం కావలసి వచ్చింది, పేషెంట్ బంధువు అయిన నాగార్జున అనే వ్యక్తి ద్వారా విషయం తెలిసిన వెంటనే ఎంఎంఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ థామస్ మక్కెన స్పందించి వెంటనే హాస్పిటల్‌కి వెళ్లి.. రక్తదానం చేశారు. ఇప్పటివరకు 71వ సార్లు రక్తదానం చేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పేషెంట్ బంధువులు థామస్ మక్కెనకి కతజ్ఞతలు తెలియజేశారు.



రక్తదానం చేస్తున్న థామస్

నాలుగో రోజుకు చేరిన దీక్షలు

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి డిపోలో యాజమాన్యం అవలంబిస్తున్న కక్ష సాధింపు చర్యలకు నిరసనగా ఏపీ పిటిడి ఎంప్లాయిస్ యూనియన్ నిర్వహిస్తున్న నిరాహార దీక్షలు నాలుగో రోజుకు చేరాయి. గురువారం ఎస్ కే కే బాషా ఆధ్వర్యంలో నిరాహార దీక్షకు కూర్చున్న డ్రైవర్లు ఎస్.కె చాంద్‌బాషా, ఎం చిన్నయ్యలకు రిటైర్డ్ కండక్టర్ వెంకటేశ్వర్లు మరియు సీనియర్ కండక్టర్ కొండయ్య పూలమాలవేసి దీక్ష ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

సాగులో విత్తన ఎంపిక కీలకం

నకిలీ విత్తనాల పట్ల అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

వర్షాలు దండిగా కురుస్తున్నాయి.పంట కాలువల ద్వారా సాగునీరు పంట పొలాలకు చేరుతుంది.జిల్లాలోని రైతులు ఇప్పటికే వేసవి దుక్కులు చేసుకొని విత్తనాలు విత్తుకునేందుకు సన్నద్ధమయ్యారు. ఈనేపథ్యంలో సాగులో విత్తన ఎంపిక అతి ముఖ్యం అని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. నకిలీ విత్తనాలతో మోసపోకుండా నాణ్యమైన వాటిని గుర్తింపు పొందిన డీలర్ల వద్దే కొనుగోలు చేయాలని రైతులకు సూచిస్తున్నారు. కొన్న విత్తనాలకు,ఎరువులకూ బిల్లు తీసుకోవాలి.



సొంతంగా విత్తన ఎంపిక

రైతు ఏ పంట వేయాలో నిర్ణయించుకున్న తర్వాత నాటే విత్తనాల్లోని వంద గింజలను తీసుకోవాలి. వాటిని తడిగుడ్డలో వేసి ముడి ముడివేయాలి. ఆ విత్తనాలను ఐదురోజుల్లో రెండుసార్లు తడపాలి. ఆరో రోజు గుడ్డను విప్పి వంద గింజల్లో ఎన్ని మొలకలొచ్చాయో చూడాలి. 70 అంతకన్నా ఎక్కువ విత్తులు మొలకొస్తే ఆ విత్తనాలు బాగున్నాయని అర్థం. గింజను బట్టి కూడా విత్తన నాణ్యత ను తెలుసుకోవచ్చు. మొలక శాతం తక్కువ వల్ల పంట దిగుబడి తగ్గిపోతుంది. గుర్తింపు పొందిన విత్తన డీలర్ల వద్దనే విత్తనాలు కొని రసీదు పొందాలి. ఇలా కొన్న విత్తనాలు మొలవకున్నా, దిగుబడి రాకపోయినా డీలర్‌ను అడిగే హక్కు రైతులకుంటుంది. సదరు కంపెనీ నుంచి పరిహారం పొందే అవకాశం కూడా ఉంటుంది. వ్యవసాయ రంగంలో పంటల సాగు విధానంలో పంట ఉత్పత్తులను అధికంగా సాధించాలంటే శ్రేష్టమైన విత్తనాన్ని ఎంచుకోవడం చాలా కీలకం.విత్తనాలు ఉన్న సంచులు, సరైన సీలుతో ధవీకరణ పత్రంతో ఉన్న వాటినే కొనుగోలు చేయాలి.విత్తన సంచులపై విత్తనరకం, ల్యాబ్ నంబర్, గడువు తేది తదితర వివరాలు సరిగా ఉన్నాయో లేవో చూసిన తరువాత మాత్రమే కొనుగోలు చేసుకోవాలి.హైబ్రిడ్ విత్తనం కొనుగోలు చేసేటప్పుడు విత్తనరకం, భౌతిక స్వచ్ఛత, మొలకెత్తే స్వభావం, జన్యుపర నాణ్యతను లేబుల్ మీద ఉన్నాయో లేదో గమనించి కొనుగోలు చేయాలి.విత్తనాన్ని దుకాణదారుని నుండి కొనుగోలు చేసిన తర్వాత ఇంటివద్దనే విత్తన మొలకశాతాన్ని పరీక్షించుకున్న తర్వాత సంతప్తికరంగా ఉంటేనే పొలంలో విత్తుకోవాలి.విత్తనంలో మొలకశాతం తక్కువగా ఉంటే కొనుగోలు చేసిన దుకాణదారుని దగ్గరకు తీసుకవెళ్లి పరిస్థితిని వివరించి వేరే విత్తనాలను తీసుకోవాలి.

విత్తనంలో ఉన్న లోపాన్ని వివరించిన తరువాత కూడా దుకాణదారుడు సరైన విధంగా విత్తనాన్ని మార్చి ఇవ్వకపోతే సదరు డీలర్‌పై వ్యవసాయశాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.తద్వారా విత్తన పరిహారం పొందే హక్కు రైతులకు ఉంటుంది.పంటకు నష్టం జరిగితే రైతుకు రశీదే కీలక ఆధారం కాబట్టి పంట కాలం పూర్తయ్యే వరకు కొనుగోలు చేసిన రశీదును జాగ్రత్తగా ఉంచుకోవాలి.సీల్ తీసి ఉన్న విత్తన సంచులు, పగిలిన విత్తన ప్యాకెట్లు, మూతలు తీసిన డబ్బాల్లోని విత్తనాన్ని కొనుగోలు చేయరాదు.విత్తనాన్ని కొనుగోలు చేసే క్రమంలో విత్తన సంచి బరువు తక్కువగా అనిపిస్తే డీలర్ ముందు తూకం వేయించి తక్కువగా ఉన్న విత్తనాన్ని డీలర్‌కు ఇచ్చి కొత్త విత్తనాన్ని తీసుకోవాలి.రైతు విత్తనం కొనుగోలు చేసే సమయంలో ఎక్కడ తయారీ అయ్యిందో ఏ కంపెనీ వారు పంపిణీ చేసారో, విత్తనాలు అమ్మిన దుకాణదారుడి ద్వారా తెలుసుకోవాలి.

రైతులు ఎంపిక చేసుకునే విత్తనాల్లో రకాలు

– బ్రీడర్‌సీడ్– ఈ రకం విత్తనం అన్ని రకాల విత్తనాలకు మూల విత్తనం. దీన్ని రూపొందించిన పరిశోధనా స్థానాలలోనే ఆయా శాస్త్రవేత్తల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. జన్యు స్వచ్ఛత 100 శాతం ఉంటుంది. విత్తనం సంచులకు "పసుపు రంగు ట్యాగ్" ఉంటుంది.

– ఫౌండేషన్ రకం విత్తనం– ఈ రకం విత్తనాన్ని బ్రీడర్ విత్తనం నుండి ఉత్పత్తి చేస్తారు. వివిధ పరిశోధనా స్థానాలు రాష్ట్ర విత్తనాభివద్ధి సంస్థ ఆశ్వర్యంలో నడుస్తున్న విత్తనాభివద్ధి క్షేత్రాలలో సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో ఉత్పత్తి చేస్తారు. ఇవి కూడా దాదాపు 100 శాతం జన్యుస్వచ్ఛత కలిగి ఉంటాయి. సంచులకు 'తెలుపు రంగు' ట్యాగ్ ఉంటుంది.

– సర్టిఫైడ్ సీడ్ – ఈ రకం విత్తనాన్ని ఫౌండేషన్ విత్తనం నుండి సీడ్ సర్టిఫికేషన్ వారి ఆధ్వర్యంలో రైతుల పొలాల్లో పండిస్తారు. ప్రయోగశాలల్లో పరీక్షించి నిర్దేశించిన ప్రమాణాలు కలిగిన వాటికి ధవీకరణ విత్తనం లేబుల్ ఇస్తారు. దీనికి 'నీలిరంగు' ట్యాగ్ ఉంటుంది.

– ట్రూత్‌ఫుల్ లేబుల్– మార్కెట్‌లో ఉత్పత్తిదారులు సొంత పూచికత్తుతో ట్రూత్‌ఫుల్ లేబుల్ అనే ట్యాగ్ వేసి విత్తనాలను అమ్ముతూ ఉంటారు. వీటికి లేత ఆకుపచ్చరంగు ట్యాగ్‌ను వాడతారు. వీటిని ఉత్పత్తిని చేసే సంస్థ లేదా వ్యక్తులను బట్టి విత్తన కొనుగోలు చేస్తారు. ఇలా రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు విత్తన రకాలు మరియు కాలానుగుణంగా వివిధ పంటలలో వేసుకొనే విత్తనాల సమాచారాన్ని ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ అధికారులను సంప్రదించి వారి సలహాలు, సూచనలను పాటించి విత్తనాలు కొనుగోలు చేయాల్సి ఉంది.

ఎంబీబీఎస్ ఫీజులపై

మాట మార్చడం సరికాదు: ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

గత సంవత్సరం నుంచి ప్రారంభమైన ఐదు ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో 107,108 జిఓలను రద్దు చేస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసి, పాత ఫీజు విధానాన్ని విధానాన్ని కొనసాగించాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ వినోద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వం ప్రారంభించిన 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో ఐదు కళశాలలకు గత విద్యా సంవత్సరం ఎన్ఎంసి అనుమతులు ఇచ్చారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఎన్నడు లేని విధంగా మూడు విభాగాలుగా ఫీజులను నిర్ణయించిందన్నారు. ఈ విధానంపై అనేక విమర్శలు వచ్చినా, పలు రూపాల్లో విద్యార్థి సంఘాలు విన్నవించినా ఆనాటి ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరించిందన్నారు. జీఓలను రద్దు చేయాలని ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన నాయకులు నాడు తీవ్రంగా స్పందించారని గుర్తు చేశారు. యువ గళం యాత్రలో నేటి విద్యాశాఖ మంత్రి లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే జీఓలను రద్దు చేసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తరువాత ఫీజుల పద్ధతిని యధావిధిగా కొనసాగిస్తున్నారని, ఈవిషయాన్నే హైకోర్టుకు చెప్పారని వివరించారు. ఈవిధానం విద్యార్థులను మోసం చేయడమేనని పేర్కొన్నారు. దీని వలన పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీమేరకు 107,108 జీఓలను రద్దు చేయాలని, ప్రతిభగల పేద విద్యార్థులకు కొత్త వైద్య కళాశాలల్లో ఎంబిబిఎస్ సీట్లను కేటాయించాలని కోరారు.

'ఆంధ్రకేసరి' ఇన్‌ఛార్జి వైస్ చాన్సలర్‌గా మూర్తి


మూర్తి

ప్రజాశక్తి-ఒంగోలు

ఒంగోలు ఆంధ్రకేసరి యూనివర్సిటీ ఇన్‌ఛార్జి వైస్ చాన్సలర్‌గా ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ ప్రొఫెసర్ డివిఆర్ మూర్తి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది.

మధ్యాహ్న భోజనంలో

లోటుపాట్లకు తావివ్వొద్దు..

పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్ వెంకటమురళి


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన మధ్యాహ్న భోజన పథకాన్ని ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ జె వెంకటమురళి సూచించారు. బాపట్ల మండలం కొండుబొట్లపాలెం మరియు నందిరాజు తోట లోని ప్రభుత్వ పాఠశాలలను జిల్లా కలెక్టర్ గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. క్లాసు రూములను, జరుగుతున్న విద్యాబోధన తీరును పరిశీలించారు.అక్కడే విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకంపై అధికారులు, ప్రధానోపాధ్యాయులు నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. మధ్యాహ్న భోజనం పథకంలోని మెనూను ఖచ్చితంగా అమలు చేయాలన్నారు. పిల్లలకు ఐదు రోజులపాటు కోడిగుడ్లు ఇవ్వాలని, మూడు రోజులు రాగిజావ, మరో మూడు రోజులు చిక్కీలు ఇవ్వాలన్నారు. విద్యాబోధనను మెరుగుపరచాలన్నారు. బాపట్ల ఆర్‌డివో జి రవీందర్, తహశీల్దార్ శ్రావణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరలకే నాణ్యమైన సరుకులు

కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్


సరుకులు అందజేస్తున్న ఆర్డీవో జాన్‌ఇర్విన్

ప్రజాశక్తి-దొనకొండ

నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించి ప్రభుత్వం సరసమైన ధరలతో నాణ్యమైన సరుకుల అమ్మకం కార్యక్రమం చేపట్టిందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కనిగిరి ఆర్డీవో జాన్‌ఇర్విన్ పేర్కొన్నారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన గురువారం పాల్గొని ప్రజలకు బియ్యం, కందిపప్పు అందించి ప్రారంభించారు. ఆర్డీవో మాట్లాడుతూ పౌరసంబందాల శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు హెూల్‌సేల్ ధరలకు నాణ్యమైన సరుకులు అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ఎన్.శివకోటేశ్వరరావు, తహశీల్దార్ సుజాత, జడ్పీటిసీ సుధాకర్, మాజీ జడ్పీటిసీ రమణాయాదవ్, వ్యాపారస్తులు పాల్గొన్నారు.

కొండపి: ప్రజలకు నిత్యావసర సరుకులైన బియ్యం, కందిపప్పులను అతి తక్కువ ధరలకు అందించాలనే ఉద్దేశంతో కలెక్టర్ ఆదేశాల మేరకు కొండపి తహశీల్దారు కార్యాలయంలో బియ్యం, కందిపప్పు ఇవ్వడం జరుగుతోందని తహశీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజలు నాణ్యమైన బియ్యం బిపిటిలు రెండు రకాలు ఒక రకం రూ.49, రెండవ రకం రూ.48, కందిపప్పు రూ.160కి ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ ఏయంసి చైర్మన్ జి.రామయ్యచౌదరి, యంపిడివో నాగమణి పాల్గొన్నారు.

స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు చర్యలు

కలెక్టర్ తమీమ్ అన్సారియా


మంచినీటి పథకాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రజాశక్తి-కొండపి

ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్అన్సారియా అధికారులను ఆదేశించారు. కలెక్టర్ తమీమ్ అన్సారియా గురువారం కొండపి మండల కేంద్రంలో వున్న గ్రామీణ రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. 40 కోట్ల రూపాయలతో ఈ తాగునీటి పథకాన్ని చేపట్టడమైందని, కొండపి మండల కేంద్రంతో పాటు 27 ఆవాస గ్రామాలకు ఈ పథకం ద్వారా తాగునీరు సరఫరా చేయడం జరుగుతుందని అధికారులు కలెక్టర్‌కు వివరించారు. అనంతరం కొండపికు సంబంధించి చెత్త డంపింగ్ ప్రదేశాన్ని పరిశీలించారు. ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ పారిశుద్ధ్య కార్యక్రమం పటిష్టంగా అమలు జరగాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మర్దన్ ఆలీ, తహశీల్దార్ కిరణ్‌కుమార్, ఎంపిడిఓ నాగమణి, ఆర్.డబ్ల్యూ.ఎస్. ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

ఒంగోలు సబర్బన్: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి, వారుసంతృప్తి చెందేలా మెరుగైన సేవలందించాలని జిల్లా కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఒంగోలు మండలం యరజర్లలో గురువారం ఆమె పర్యటించారు. ఆ గ్రామంలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద తయారి కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామంలోని సచివాలయన్ని తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు పట్టీలను పరిశీలించారు.న జనన, మరణ రిజిస్టర్‌లు, ఆస్థిపన్ను వసూళ్ల రిజిస్టర్‌లను పరిశీలించి, సిబ్బంది ద్వారా పలు విషయాలను ఆరాతీశారు. గ్రామంలోని ఓవర్ హెడ్ ట్యాంకులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో పిల్లల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లో పిల్లలకు అందిస్తున్న బోజనాన్ని రుచి చూశారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల బరువుకు సంబంధించిన రిజిస్టర్లను సక్రమంగా నమోదు చేయకపోవడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. తరువాత గ్రామంలో మండల పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. మధ్యాహ్న బోజన పథకాన్ని పరిశీలించి, బోజనాన్ని రుచిచూశారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. కలెక్టర్ వెంట డిపిఓ ఉషారాణి, ఈఓఆర్డీ రమణమ్మ, తహసిల్దార్ సుజనకుమార్ , ఎంపిడిఓ శ్రీనివాసరావు ఉన్నారు.


మాగుంటకు అర్జీ ఇస్తున్న నేతలు

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేలా చూడాలి

ఎంపీకి రైతుసంఘాల నేతల వినతి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

2021లో ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వానికి ఇచ్చిన హామీలు అమలు చేసేలా చూడాలని జిల్లా సంయుక్త కిసాన్‌మోర్చా, రైతు సంఘాల ప్రతినిధులు గురువారం ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డికి వినపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వ హామీలపై పార్లమెంటు సమావేశాలలో చర్చించి రైతాంగ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో ప్రకాశం జిల్లా సంయుక్త కిసాన్‌మోర్చా కన్వీనర్ చుండూరి రంగారావు, కౌలు రైతు సంఘం నాయకులు ఎస్‌కె మాబు, కె వీరారెడ్డి, మారెళ్ల శేషసాయి , ఎస్ నాగరాజు తదితరులు ఉన్నారు.

గంజాయి విక్రయాలపై ఉక్కుపాదం

తాలూకా, వన్‌టౌన్ స్టేషన్లను పరిశీలించిన ఎస్పీ దామోదర్



తాలూకా పోలీస్‌స్టేషన్‌లో పరిశీలిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ ఏఆర్.దామోదర్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఒంగోలు తాలూకా మరియు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను గురువారం ఎస్పీ దామోదర్ ఆకస్మికంగా సందర్శించి.. తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలలో భాగంగా స్టేషన్ ల పరిసరాలను, విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరు, డ్యూటీల కేటాయింపు, రిసెప్షన్ కౌంటర్ నిర్వహణ, ఫిర్యాదుల స్వీకరణ విధానం, స్టేషన్ పరిధిలోని మ్యాప్, స్టేషన్లోని పలు రికార్డ్స్‌ను మరియు తదితర అంశాలను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌ల ఆవరణను పరిశుభ్రంగా, పచ్చదనం ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. రికార్డ్స్ ను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో శాంతి భద్రతలు పరిరక్షణ, నేర నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై, ఇతర ప్రాధాన్యత గల విషయాలపై ఆరా తీసి పలు సూచనలు చేసారు. గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని, పెండింగ్ కేసులపై దష్టి సారించి త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేయాలని చెప్పారు. నేరాల కట్టడికి గస్తి ముమ్మురం చేయాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా హైవే మొబైల్, రక్షక్ వాహనాలతో పెట్రోలింగ్ , నైట్ బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బందిని తరచూ అప్రమత్తంగా చెయ్యాలని, విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలన్నారు. పోలీసు స్టేషన్ కు ఫిర్యాదు చేయుటకు వచ్చే ఫిర్యాదులుదారులు పట్ల మర్యాదపూర్వకంగా మాట్లాడాలన్నారు. ఎస్పీ వెంట ఒంగోలు డిఎస్పీ కిషోర్ బాబు, ఎస్బి సిఐ రాఘవేంద్ర, ఒంగోలు తాలూకా సిఐ షేక్ ఖాదర్ బాషా, ఒంగోలు వన్ టౌన్ సిఐ ఆలీ సాహెబ్ మరియు ఎస్ఐలు ఉన్నారు.

'లక్కీ'లో హీరోయిన్ల సందడి

సినీ తారలతో కలిసి షాపింగ్‌మాల్‌ను ప్రారంభించిన మంత్రి స్వామి


షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి


షాపింగ్‌మాల్ ప్రారంభోత్సవంలో హీరోయిన్ సంయుక్త మీనన్, ఎంపీ, ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు నగరంలోని లక్కీ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా సినీ హీరోయిన్లు సంయుక్త మీనన్, శ్రీలీల సందడి చేశారు. గురువారం ఒంగోలు, కర్నూల్‌రోడ్‌లో లక్కీ షాపింగ్‌మాల్‌ను మంత్రి, ఒంగోలు పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులరెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్ధన్‌రావు, సంతనూతలపాడు శాసనసభ్యులు బిఎన్.విజయ్‌కుమార్, సినీ హీరోయిన్ సంయుక్త మీనన్, శ్రీలీల చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి స్వామి మాట్లాడుతూ అందరికీ అందుబాటు ధరలలో నాణ్యమైన దుస్తులను ప్రకాశం జిల్లా ప్రజలు లక్కీ షాపింగ్‌మాల్ వారు తీసుకొని వచ్చారని, కొనుగోలుదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో లక్కీ షోరూమ్ అధినేతలు శ్రీను, రత్తయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.